RNI APTEL / 2006 / 17980

POSTAL REGD. VSP / 142 / 2018 - 2020

CHRISTAVANAADU,
P.B.No. : 2, Old Dairyfarm(Po),
Adarsh Nagar,
Visakhapatnam - 530 040.

# క్రైస్తవనాడు


ఆధ్యాత్మిక, సామాజిక వార్తా పక్షపత్రిక

CHRISTAVANAADU TELUGU FORTNIGHTLY REGD.NEWS PAPER
PUBLISHED FROM VISAKHAPATNAM.
ఎడిటర్ : వై.కనకరాజు

● christavanaadu@gmail.com ● facebook.com/christavanaadu
Br.YKR : 7981542666 | Br.YLR : 9985656511 | Br.YDR : 9866113513

సంపుటి Vol 13 | సంచిక No 14 | 2019 మార్చి March 1-15 | పేజీలు Pages 8 | వెల Rate ₹ 5

యేసుక్రీస్తు అందరికి ప్రభువు ★



## నమ్మదగిన దేవుడు

దేవుని గూర్చి లోకంలో అనేక తర్జన భర్జనలు వింటుంటాం. దేవుడెవరు? ఈ ప్రశ్నకు ఎవరికి తోచిన జవాబు వారు చెప్పుట కద్దు. ఆ మాత్రం ఈ మాత్రం గ్రంథ పరిశోధనలున్న వారు మాత్రం ఆయాగ్రంథాల్లోనున్న వాటిని బట్టి దేవుని తెలియజేస్తూంటారు. కొందరైతే అసలు దేవుని ఉనికే ప్రశ్నార్ధకం అంటారు. దేవుడున్నాడన్న నమ్మకం మాకు లేదంటారు మరికొందరు. ఇలా అనేక రకాలుగా దేవుని గురించి మనం వినగలం. అయితే మనకో భాగ్యముంది. అదేదనగా...దేవుని గూర్చి సంపూర్ణంగా తెలియజేయు గ్రంథం 'పరిశుద్ధ గ్రంథం' ను కలిగి ఉండుటయే! ఇది మన సంపూర్ణ విశ్వాసం. 2



ఒకరు దేనివలన చిరస్థాయి పేరు పొందగలరంటే.. కేవలం మాటచేతే

- డా.చాగంటి కోటేశ్వర రావు



మందపై అధికారులుగా గాక వారికి మాదిరిగా ఉండాలనుకున్నవారే క్రీస్తు ఆత్మ కలిగినవారు

- బిషప్ ఎం.ఎ.పాల్
విశాఖపట్నం



నిజాయితీపరున్ని నడిపించేది ధనం కాదు.. జనం

- బాలకృష్ణ
'శ్రీమన్నారాయణ' చిత్రంలో

**ఇద్దరు లేక ముగ్గురు!** నా చిన్నప్పుడు ఇద్దరు లేక ముగ్గురు పిల్లలు చాలన్నది ఎక్కువగా వినేవారం, సినిమాల్లోనూ, వీధుల్లోనూ దాని తాలూక ప్రకటనలు చూసేవారం. ఇప్పుడేమో సేవకులకు ఇద్దరు లేక ముగ్గురు పెళ్లాలని వింటున్నాం. ఇది కడు ధౌర్భాగ్యమంటున్నారు దేవుని వాక్యాన్ని తమ జీవనంలో చూపేవారు - బ్రదర్ వై.కనకరాజు, హోలీ బైబ్లిసిస్ట్.

## ఏ పరిస్థితుల్లోనైనా ..

# దేవుని నామస్మరణే చాలు!



అంకెలు, అక్షరాలు మార్చాల్సిన పనిలేదు. అలాగే ఏ నాగదోషాలు, సర్ప దోషాలు, యాగాలు చేయాల్సిన అవసరమూ లేదు! అవన్నీ అవి చేసేవారి వ్యాపారాలను పెంచేవేనని గుర్తించండన్నారు ఓ టీవీ ఛానల్లో మాట్లాడుతూ డా.గరికపాటి నరసింహారావు! అలాగే మనమున్న సమాజాన్ని మార్చుకొనేది మనమే.. దేవుడు మార్చడనీ అన్నారు.

## యేసు కు సాదృశ్యం ఇదా?!



సిలువ రూపాన చెక్క, ముళ్ల కిరీటంలా చక్రం, దానికో చున్నీలా కన్పడే వస్త్రం అందంగా కన్పడొచ్చు. కన్పడినంత మాత్రాన అవి క్రీస్తుకు సాదృశ్యం కాదు. సారూప్యాలు అసలేకావు. యేసుని స్ఫురణకు తెచ్చే మానవరూపం ఆ సిలువనే చెక్కపై లేకుంటే దానికి విలువేంటన్నది పరిశుద్ధ గ్రంథంలో పట్టున్నవారి మాట. అలా చూపుతూ బోధించు వారికి అది తెలిసేదెన్నడో?

*'క్రైస్తవనాడు' పేపర్లో గత కొన్ని సంవత్సరాలుగా ఇవ్వబడుతున్న ఈ ప్రకటనను చదివి మార్పు చూపుతున్నవారినిబట్టి 'దేవునికి స్తోత్రము' చెల్లిస్తున్నాం - బ్రదర్ వైకెయార్*



## బోధకులు 'హల్లెలూయ' అంటే ఏమౌతుంది! పి.జె.స్టీఫెన్ పాల్ విచిత్రమైన బోధ!

అనేకమంది ఎదురుచూస్తున్న ఈ బోధ గురించి వివరణ మార్చి నెల 16-31లో ఇవ్వాలనుకుంటున్నాం. సమయాభావంవల్ల ఆ వివరణను ఏప్రిల్ నెలలో పాఠకులు తప్పక చదవగలరు. సత్యాసత్యాలను ఎరుగగలరు. వాక్యానుసారంగా వివరించబడే ఆ యా విషయాలను వీలున్నంతమట్టుకు మరనేకులతో పంచుకోగలరనీ పాఠకులను కోరుతున్నాం

- ఎడిటర్

## అమృత్‌సర్ లో...

# 'క్రైస్ట్స్ కేర్ ఎన్ క్యూర్ మినిస్ట్రీస్'



విశాఖ కేంద్రంగా విదేశాల్లో సహితం సేవలందిస్తున్నారు 'క్రైస్ట్స్ కేర్ ఎన్ క్యూర్ మినిస్ట్రీస్' అధినేత బిషప్ ఎం.మోహనరావు. అందులో భాగంగానే నార్త్ ఇండియాకు సంబంధించి అమృత్‌సర్‌లో పాస్టర్స్ ఫెలోషిప్‌లో బోధించేందుకు సతీసమేతంగా వెళ్లారు.

# పిల్లల పెంపకంలో తలిదండ్రులపాత్ర!

నేటి సమాజంలో అనేకులు తమ పిల్లలను సక్రమంగా పెరుగుతున్నారని అనుకుంటున్నారు. లోకంలో ఘనంగా ఉండాలని వారి పిల్లలను పెంచుతున్నారు గాని దేనిని అనుసరిస్తే పిల్లలు ఘనులవుతారో ఎరుగకపోవడం ఒకింత ఆశ్చర్యమే. ప్రతి ఒక్కరు లోకంలో ఘనులవలేరు. ఒకరు ఒక విషయంలో ఘనంగా ఉంటే వారిని తలదన్నేవారు మరొకరు వస్తున్నారు. వచ్చినవారు గొప్పవారా? అని ఆలోచిస్తే వారినీ తలదన్నే వారు మరొకరు. ఇలా చూసుకుంటూపోతే లోకంలో ఒకరికి మించి మరొకరు పుట్టుకుంటునే వస్తున్నారు. వారి ఘనత భూమి మీద కొంతకాలానికి మరిచిపోతూనే ఉంటున్నారు. దీనిని ఘనతంటే అది మన బుద్ధిహీనతే సుమా! ఒక సారి ఆలోచించండి. ఘనత అనేది నిత్యమైనదైయుండాలి. ఎవరూ మరువనిదైయుండాలి. ఇవి పిల్లలకు ఉండాలంటే కేవలం దేవునిలోనే సాధ్యం. అందుకు యేసుక్రీస్తువారే మనకు ప్రత్యక్షసాక్షి. ఆయన తల్లిదండ్రులు దేవునిలో పెంచటం ఆయన దేవుని వాక్యంలో, దేవుని మార్గంలో నడవటం వల్ల దేవుని ఆయనను శకపురుషునిగా చేసారు. ఆయన పుట్టి ఇప్పటికీ 2000 సంవత్సరాలు గడిచాయి. ఇప్పటికి, మరెప్పటికి ఆయనను తలదన్నే వారు వుండరు. ఘనతంటే ఇలా ఉండాలి. ఇది దేవుడు మాత్రమే ఇవ్వగలిగే ఘనత. ఎప్పటికి మరువలేనిది మరెప్పటికి తిరగరాయనిది. పరిశుద్ధ గ్రంథంలో చూస్తే... దేవుని కోసం బ్రతికిన వారందరూ ఘనత పొందినవారే. వారి పేర్లు వాడకుండా మనం పరిశుద్ధ గ్రంథాన్ని బోధించలేమని మనకు తెలుసు. పిల్లలను దేవునిలో పెంచితే దేవునిలోనూ, లోకంలోనూ ఘనులముగా పెరుగుతాం. దేవుని కోసం బ్రతికిన వారికి ఆయన ఇచ్చిన ఘనతను మరెవ్వరూ దానిని అధిగమించలేరు. ఎందుకంటే ఆయన ఇచ్చే మహిమ ఘనతలు వెరెవ్వరూ ఇవ్వలేరు. మనం పిల్లలను పెంచే విషయంలో యధార్థత ఉండాలి. ఏదో ఆశించి పెంచితే కడకు అది నాశనానికే గాని దేవుని చెంతకు కాదు. తల్లిదండ్రులు లోకంలో పెరిగితే కూమారులు కూడా లోకంలోనే పెరుగుతారన్నది పరిశుద్ధ గ్రంథంలో చెప్పబడిన వాక్య సారాంశం.

**తండ్రియేమి చేయుట చూచెనో కుమారుడు అదే చేయును ★**

పిల్లలు దేవునిలో పెరగాలంటే తల్లిదండ్రులు ముందు " దేవుని ప్రేమలోనూ", "వాక్యంలోనూ" పెరిగితే వారి పిల్లలను కూడా దేవునిలో పెంచగలరు. అలా పెంచినప్పుడే దేవుడు మీకు మీకుటుంబానికి ఘనత మహిమ కలుగజేస్తారు. ఆలోచించండి! ఆచరించండి!! దేవుని ఘనత మహిమ ప్రభావములు యుగయుగములు ఉండునుగాక!! ఆమెన్.

-బ్రదర్ వై.ఎల్. రవిరాజు

*LAST CHANCE TO JOIN*

**MBBS / MD, IN PHILIPPINES FOR 2018**

*__Pay only Rs.2,50,000/-__ (Including College fee, Visa Process, Flight Tickets & Etc.).*


**We will take the Students to join in this month of November. NEET exam not required.**

***Golden Chance Hurry up. Only few seats Available.***

*Please contact for immediate Admission and more details :*
***M.Joshua & Danielson***
**+91 9866 060 731** (Whatsapp also same number)

***New Hope Educational Consultancy***
***Address : Deepthisree Nagar, Madinaguda, Hyderabad.***

# నమ్మదగిన దేవుడు



(మొదటి పేజీ తరువాయి) ఆయా తరాల్లో నున్న వారి మాటలను బట్టి నేడు ఎందరో పరిశుద్ధ గ్రంథం ద్వారా దేవున్నెరు గుతున్నారు. లోకంలో దేవుళ్ళుగా అనేకులు పరిగణింపబడుతున్నా... ఆయా దేవుండ్లనబడినవారిని పూజించు వారికి సహితం ఒక్కోసారి 'నమ్మదగిన దేవుడెవరు?' అన్న సందేహం వస్తుందన్న సంగతిని మనమూ అనేక సార్లు వింటుంటాం. దానికి జవాబు వారికెలా దొరుకుతుందో మనం ఎరగలేముగాని దానికి జవాబు మాత్రం పరిశుద్ధగ్రంథంగా ప్రపంచ వ్యాప్తంగా అత్యధికులచే కీర్తించబడుతున్న బైబిల్లో చదువగలం.

'నమ్మదగిన దేవుని' గూర్చి పరిశుద్ధ గ్రంథంలో గల వచనాన్ని ఓ సారి చదువుకుంటూ ముందుకెళ్దాం. పరిశుద్ధ గ్రంథంలో వ్రాయబడిన, ప్రకటించబడుతున్న దేవుడే నమ్మదగినవాడా అన్నదీ పరీక్షించి చూడాలిగా..!

**....కాబట్టి నీ దేవుడైన యెహోవా తానే దేవుడనియు, తన్ను ప్రేమించి తన ఆజ్ఞల ననుసరించి నడుచుకొనువారికి తన నిబంధనను స్థిరపరచువాడును, వేయితరముల వరకు కృప చూపువాడును 'నమ్మదగిన దేవుడనియు' తన్ను ద్వేషించు వారిలో ప్రతివానిని బహిరంగముగా నశింపజేయుటకు వానికి దండన విధించువాడనియు నీవు తెలిసికొనవలెను.** ★

మనకు ప్రకటింపబడిన.. మనమెరుగుతున్న దేవుడు, మనచే అనేకులకు ప్రకటింపబడుతున్న దేవుడు యెహోవా. ఆయనే తన ప్రజలకు తన్ను గూర్చి తెలియజేసుకున్న లేఖనాన్ని పైన చదివారు. ఆయన ఆజ్ఞలను అనుసరించాలి. వాటిని బట్టి నడవాలి. అలాంటి వారికి ఆయన వేయి తరాల వరకు కృప చూపుతానని పై లేఖనం ద్వారా వాగ్దానం చేస్తున్నారు. ఆహా, దేవుడెంత మంచివాడు. ఎంత 'నమ్మదగిన దేవుడు'. వేయితరాల వరకు మన యెడల తన కృప చూపుతానన్న ఆయనకంటే మనం ఎవర్ని నమ్మగలం? ఆలోచించాలి. అట్టి 'నమ్మదగినదేవున్నే' మన బ్రతుకుకాలంలో అనేకులకు ప్రకటిస్తున్నాం. అందుకు 'సాక్ష్యంగా' పరిశుద్ధ గ్రంథం లోగల అనేక లేఖనాలను లోకానికి ఎత్తిచూపుతున్నాం. వివరిస్తూ ఆయనే 'నమ్మదగిన దేవుడని' ఘనంగా ప్రకటిస్తున్నాం.

పరిశుద్ధ గ్రంథంలో ప్రతి లేఖనం మనుష్యుల ఊహల్లోంచి పుట్టలేదని. అవి దేవుని అత్మవలన ఆయా కాలాల్లో ప్రవక్తల ద్వారా పలుకబడ్డాయని కూడా పరిశుద్ధ గ్రంథమే సాక్ష్యమిస్తుంది. అందుకు అనుగుణంగానే ఆయా లేఖనాలు మనుష్యుల సంగతులకు అతీతంగా కన్పడుతున్నాయి. మనుష్యుల ఊహలకు అందనంత ఎత్తున ఆయా లేఖనాలున్నాయి.

అందును బట్టి 'దేవునికి స్తోత్రం' చెల్లిస్తున్నా. పరిశుద్ధ గ్రంథంలో యెహోవాయే దేవుడని మనమనేక చోట్ల చదువగలం.

ఇంతకూ యెహోవా అంటే...? 'ఉన్నవాడని' పరిశుద్ధ గ్రంథమే చెబుతుంది. అంటే ఆయన అన్నింటి కంటే ముందే ఉన్నవాడని ఎరగాలి. సృష్టికి ముందే ఉన్నవాడు. నాశనం లేనివాడు. సదాకాలం ఉండువాడు. ఇదంతా దేవుని ఔన్నత్యాన్నే సూచిస్తుంది. కాని దేవుడంటే పరిశుద్ధ గ్రంథం స్పష్టంగా ఏం చెప్పిందో ఓ సారి చూద్దాం...

**ఆదియందు వాక్యముండెను, వాక్యము దేవునియొద్ద ఉండెను, 'వాక్యము' దేవుడై యుండెను.** ★

చదివారుగా వాక్యము దేవుడని పరిశుద్ధ గ్రంథం ఖండితంగా చెప్పింది. కాబట్టి మనలో అనేకులు వాక్యములోనే దేవున్ని చూడగలుగు తున్నారు. అట్టివారే దేవునిచే ఘనపరచబడి మహిమ పరచబడు తున్నారు. అందుకు విరుద్ధంగా నేటి దినాల్లో ఎవరైనా ఓ రూపంలో దేవుడు మాకు కనబడ్డారని చెప్పినా, స్వరంతో మాట్లాడారని చెప్పినా అదంతా లేఖన వ్యతిరేకమే! ఆ విధంగా వారు లోకస్తులను మభ్యపెడుతున్నారని ఎరగాలి. అట్టివారు కొంతకాలం ప్రసిద్ధి చెందినా తుదకు శ్రమలపాలు కాగలరు. వారేకాదుగాని అట్టివారి కుటుంబం కూడా శ్రమనుపాలౌతుంది. వారిని అనుసరించే అనుయాయులు కూడా ఆలాగుననే శ్రమలపాలవక తప్పదు సుమా! అందుక్కారణం వారి లేఖన వ్యతిరేకతే. అది గ్రహించి అట్టి వారు దేవుని యెడల తనను తాను తగ్గించుకోవాలి. లేఖనానుకూలురుగా మారాలి. అలా మారితే వారు క్షమించబడగలరు. మీలో ఎవరైనా అలాంటి వారుంటే ఇది చదివినప్పటినుండైనా మారండి. మరింత తెల్సుకొనేందుకు సంప్రదించండి. మనం ఆశీర్వాదపాత్రులమగుటకే దేవునిచే పిలువబడ్డాం. ఏర్పాటుచేయబడ్డాం. దిన దినం వాక్యాన్నెరుగుతూ దేవునిలో బలపడాలి. లోకస్తులకు ఆశ్చర్యకరంగా కన్పిస్తూ చర్చలకు కారణభూతులమవాలి. ఈ విషయాన్ని ఈ లోకంలో ఉన్నంతకాలం మరువకండి. ఆ వాక్యమే దేవుడు. ఆ దేవుడే 'నమ్మదగినవాడు'. కాబట్టి వాక్యాన్ని ప్రేమించండి. ప్రతిదినం చదివిన వాక్యాన్ని గ్రహించండి. అనేకులతో పంచుకోండి. మనచే చదువబడుతున్న వాక్యమే మన ప్రభువైన యేసుక్రీస్తు. ఆయన వాక్యరూపాన ప్రతిదినం మనల్ని దర్శించే దేవుడు. మనం కూడా ప్రతిదినం ఆయన్ను వాక్యంలో ప్రత్యక్షంగా చూడగలం. వాక్యంలో ఆయన్ను చూచే స్ధితికి ఎదుగుటే ఆశీర్వాదం. ఆయన వాక్యరూపాన మన హృదయంలో నిండుతుంటే మన బ్రతుకులు పండక మానవని ఎరగండి. హృదయం నిండినదాన్ని బట్టియే నోరు మాట్లాడుతుందని యేసే చెప్పారు.. గమనించండి. మనమలా దేవున్ని అనగా వాక్యాన్ని ప్రేమిస్తుంటే మనకు మేలు కలుగుటకై సమస్తము సమకూడి జరుగుతాయి. ఇది దేవుని వాక్యం మన కిచ్చిన భరోసా. నేను నా కుటుంబం అది నమ్మాం. మేం ఊహించన కార్యాలెన్నో దేవుడు మాయెడల చేసారు.. చేస్తూనే ఉన్నారు.. చేస్తూనే ఉంటారు. అందుకవసరమైనవన్ని సమకూరుతూనే ఉన్నాయి. అందుకు 'దేవునికి స్తోత్రం'. ఈ సంగతి నన్ను నాకుటుంబాన్ని అతి దగ్గరనుంచి చూచిన వారెందరో ఇస్తున్న సాక్ష్యానికి అక్షరూపం . మావలే నేడు లోకంలో అనేక కుటుంబాలు యేసుక్రీస్తుకు సాక్షులుగా ఉన్నాయి. మాబోటివారెందరో ఆయన్ను 'నమ్మదగిన దేవుడని' ప్రకటించుటకు కారణాలనేకం. రోజురోజుకు మా జీవితాల్లో ఎన్నో కార్యాలు జరుగుతూ మా ఎదుగుదలను లోకానికి ప్రస్ఫుటంగా కనబడజేస్తుంది. ఇలా అనేక సాక్ష్యాలు క్రైస్తవ కుటుంబాల్లో వినగలం, చూడగలం. దేవుడన్నవాడు మనచే ఆరాధింపబడుతూ పూజింపబడు తున్నాడంటే ఆ దేవుడు మనల్ని అంతము వరకు కాపాడినవాడై వుండాలి. మన మరణాంతరం కూడా ఆయన మనల్ని తన యెద్దకు చేర్చుకోవాలి. అప్పుడే మనం ఆయన్ను 'నమ్మదగినదేవుడని' లోకానికి ఘనంగా ప్రకటించగలం. యేసుక్రీస్తు మనల్ని విడువను ఎడబాయను అన్నారు. సదాకాలము మీతో ఉంటానని వాగ్దానం చేసారు. వాగ్దానం చేసినవాడు నమ్మదగిన వాడని పరిశుద్ధ గ్రంథంలో ఆయన్ను గూర్చి వ్రాయబడింది. అంతము వరకు మనల్ని ఆయన స్ధిరపరుస్తారని కూడా చెప్పబడింది. కాబట్టి మనం జీవించి ఉన్నా ఈ లోకయాత్ర ముగించినా ఆయన మనల్ని తన యొద్దకు చేర్చుకొనును. ఇట్టి వాగ్దానాలు ఇచ్చి నెరవేరుస్తున్న యేసుక్రీస్తు వారే 'నమ్మదగిన దేవుడని' ఇప్పటికే ఎందరో ప్రకటిస్తున్నారు. అందుకు పరిశుద్ధ గ్రంథమే ఆధారం. మనమూ ఆలాగుననే పరిశుద్ధ గ్రంథను బట్టియే ప్రకటించాలి. మేం ప్రకటిస్తున్నాం యేసుక్రీస్తు వారు 'నమ్మదగిన దేవుడని'. మరి, వాక్యం చదువుతూ ప్రొద్దున్న లేచినప్పటి నుంచి రాత్రి పండుకొనే ముందు కూడా ఆయన్ను అనేక కోరికలు కోరుతున్నవారందరూ ప్రకటిస్తున్నారా? సరిచూచుకోవాలి. లేకుంటే కనీసం ఇప్పటినుంచైనా ప్రకటించండి మన ప్రభువైన యేసుక్రీస్తు 'నమ్మదగిన దేవుడని'. ఏమంటారు? అవునంటారా? అవునంటారనే నా ప్రగాఢ విశ్వాసం! సందేహాలున్నా ప్రశ్నలున్నా వ్రాసి మరింత వివరణలు తెల్సుకోండి, అనేకులతో పంచుకోండి. ఆయన 'నమ్మదగిన దేవుడని'. మన బ్రతుకులను నిరంతరం నూతన పరుస్తూ మనకే ఆశ్చర్యం కల్గిస్తూ తద్వారా అనేకులను ఆలోచింపజేస్తున్న ఆయన మనకు ఎంతైనా 'నమ్మదగిన దేవుడు'. అలాగే పరిశుద్ధ గ్రంథంలో తప్పులు వెదకేవారికి విమర్శించే వారికి ఆయనే దేవుడా? అన్న ఆలోచనతో పరిశోధించే వారికి తానే 'నమ్మదగిన దేవుడనని' తన ఉనికిని లేఖనాల ద్వారా బయల పరుస్తారన్నది నిర్వివాదాంశం. ఆ విధంగాను ఎందరో ఆయన మార్గాన్ని అనుసరిచే వారిని లోకంలో చూడగలం . మన ప్రభువైన యేసుక్రీస్తును పరిశోధిస్తున్న కొలదీ ఆయనే 'నమ్మదగిన దేవుడు' అని ఎవరైనా సులువుగా గుర్తించగలరు. తద్వారా తండ్రియైన దేవుని మరియు కుమారుడైన యేసుక్రీస్తు యొక్క కృపకు పాత్రులై నూతన జీవితాన్ని పొందుకోగలరు.

**ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతన సృష్టి; పాతవి గతించెను, ఇదిగో క్రొత్త వాయెను: సమస్తమును దేవునివలన నైనవి; ఆయన మనలను క్రీస్తు ద్వారా తనతో సమాధానపరచుకొని ఆ సమాధాన పరచు పరిచర్యను మాకు అనుగ్రహించెను.** ★

## దేవతలకు, యేసుక్రీస్తుకు గల కొన్ని వ్యత్యాసములు



బ్రదర్ ఎస్.ఆర్.తిరుగుళ్ల
చర్చ్ ఆఫ్ క్రైస్ట్
చీపురుపల్లి, విజయనగరం.

| దేవతలు | యేసుక్రీస్తు |
|---|---|
| 1. దేవ(దూ)తలు మొదటి నుండి పాపము చేసిరి (మత్తయి 25:41, ప్రకటన 12:8, 2పేతురు 2:4,11, 1యోహాను 3:8) | 1. యేసుక్రీస్తు పాపము చేయలేదు.(1 పేతురు 2:22) |
| 2. దేవ(దూ)తలు పాపము చేసి పాతాళ లోకములోనికి త్రోయబడిరి (2 పేతురు2:4) | 2. యేసుక్రీస్తు పాపరహితునిగా జీవించి మరణమును జయించి తిరిగి లేచెను (1కొరింథీ. 15:3) |
| 3. పాపము చేయుటకు ప్రేరేపించుటయే దేవ(దూ)తల పని. (1 యోహాను 3:12) | 3. పాపములను తీసివేయుటకు యేసుక్రీస్తు ప్రత్యక్షమాయెను. (1 యోహాను 3:5) |
| 4. దేవ(దూ)తల యందు జీవమునకు బదులు చీకటి, అనగా మరణముగలదు. మత్తయి 25:41 | 4. యేసుక్రీస్తు నందు జీవము ఉంచబడియున్నది (1 యోహాను 5:11) |
| 5. దేవ(దూ)తలు మానవుని కంటె కొంచెము ఎక్కువ. (హెబ్రీ 2:7) | 5. యేసుక్రీస్తు దేవ(దూ)తల కంటె శ్రేష్ఠుడు. (హెబ్రీ 1:4) |

**(దేవతలు, దేవదూతలు మున్నగునవి భాషాంతర పర్యాయపదములు)**

క్రైస్తవనాడు పేపర్లో పతాక శీర్షికలుగా తొలినాళ్లనుంచి తండ్రియైన దేవుని, ప్రభువైన యేసుని అనేక పేర్లతో మహిమ పరుస్తున్నప్పుడు ఇతరుల గ్రంథాల, విశ్వాసాల జోలికి వెళ్లడంలేదు. తద్వారా అనవసర వివాదాలకు దూరంగా ఉంటున్నాం. ఇది సువార్త ప్రకటనలో 'క్రైస్తవనాడు' తొలినాళ్లనుంచీ చూపుతున్న మాదిరి. ఆ విధంగా అనేకులకు సువార్త ప్రకటిస్తున్నాం. ఇది క్రైస్తవనాడు ఒరవడి. మరిన్ని రాసేట్లు మీ కుటుంబ ప్రార్ధనల్లో గుర్తు చేసుకోగలరని కోరుతున్నాం -ఎడిటర్.

***పాఠకులకో విన్నపం :*** 'క్రైస్తవనాడు' పేపర్లో కొన్ని ఆర్టికల్స్ గురించి, మరనేక వాక్యానుసార వివరణలు, విషయాలపై "రాబోవు 'క్రైస్తవనాడు' పేపర్లలో" అనిగాని, 'త్వరలో' అనిగాని ప్రకటింపబడుతున్న సంగతి పాఠకులైన మీరు గమనించే ఉంటారు. ఆ యా విషయాలు మేమన్నట్లే వీలునుబట్టి ప్రచురిస్తూనే ఉన్నాం గమనించగలరు. వాటిలో మరికొన్నింటిపై పాఠకుల్లోగల ఆసక్తి, స్పందనబట్టి ప్రచురిస్తుంటాం. అయితే అటువంటి వాటిని గురించి పాఠకులు అడిగితే తప్పక ప్రచురించగలం. అలాగే, దుర్బోధలు చేస్తున్న బోధకులపై 'క్రైస్తవనాడు'లో ఏ ఆర్టికల్ ప్రచురించబడినా దానిపై ఆ యా బోధకులు ఖండనలిచ్చినా లేక ఉత్తరాల ద్వారా పాఠకులైన మీరు కోరినా తప్పక ప్రచురించగలమని మరోసారి ఈ సందర్భానా తెలియజేస్తున్నాం - బ్రదర్ వైకెయార్.

• christavanaadu@gmail.com • christavanadu@gmail.com • facebook: christavanaadu
• Br Y Kanaka Raju : 7981542666 / 9346960601 • Br Y L Raviraju : 9985656511
• Br Y Dhana Raju : 9866113513


**ANDHRA PRADESH :** CHRISTAVANAADU,
13 - 237, AMBEDKAR NAGAR, OLD POLICE STATION CENTRE,
NR. TIC POINT, ARILOVA, VISAKHAPATNAM - 530 040.

**TELANGANA :** CHRISTAVANAADU C/O A.PREM KUMAR,
1-5-89/6, CSI MISSION COMPOUND, SADASIVPET,
SANGAREDDY DIST - 502 291.

**ఎందుకు?! :**

'క్రైస్తవనాడు'లో హైందవ పండితులు, ఇతరులు, సినిమావాళ్లుచెప్పేవి మరియు రాజకీయాలను గురించి ప్రచురించుటెందుకన్నది 'మనలో' అనేకుల సందేహం! హోలీ బైబిలు దేవుని గ్రంథమంటూ బోధిస్తూ ఇతరులను, సినిమావాళ్లను చులకనజేసి మాట్లాడే ప్రబుద్ధులెందరో 'మనలో' ఉన్నారు. క్రైస్తవేతరుల మాటలు, చేతలే అంతలా ఆలోచింపజేస్తుంటే.. జీవంగల దేవుని మాటలు మరెంతలా ఆలోచింపజేయాలి! 'మనలో' ఎందరి మాటలు, చేతలు లోకాన్ని ఆలోచింపజేసి ప్రభావితం చేయగలుగుతున్నాయోనన్నది తెలిపేందుకే 'క్రైస్తవనాడు'లో అవి ప్రచురిస్తున్నాం. ఇక రాజకీయాలను గురించి... ఆ యా కాలాల్లో జరిగిన సమకాలీన రాజకీయాలు. సంగతులను అనేకం హోలీ బైబిల్లో దేవుడు వ్రాయించారు. 'నర'లోక సంగతులనే అవగాహన చేసుకోలేనివారు 'పర'లోక సంగతులను ఎలా గ్రహించగలరు? అందుకే 'నర'లోక రాజకీయ సంగతులు 'క్రైస్తవనాడు'లో చోటుచేసుకుంటున్నాయి. తొలి నుంచీ 'క్రైస్తవనాడు'ది అదే ఒరవడి. అందుకు హోలీ బైబిలే మాకు మాదిరి. అందుకే 'క్రైస్తవనాడు'కు అంత ఘనత! అందుకు 'దేవునికి స్తోత్రము'.

క్రైస్తవనాడు
ఆధ్యాత్మిక, సామాజిక వార్తా పక్షపత్రిక



దేవుని వాక్యమే సత్యము.. సకలాశీర్వాదాలకు కారణం. ఆ వాక్యమే 'క్రైస్తవనాడు' కు ఆయుధం. అందుకు దేవునికి స్తోత్రము.

**సత్యవాక్య పోరాటంలో...**
**13వ సంవత్సరం.**

బ్రదర్ వై కనకరాజు, హోలీ బైబ్లిసిస్ట్.

# పరీక్షించకపోతే...!



క్రైస్తవ్యంలో అనేకచోట్ల వ్యక్తారధనలెక్కువై పోతున్నాయి. తమ కోసం తమిష్టప్రకారం చెప్పే బోధకులను విశ్వాసులే ఎంచుకొనుట విడ్డూరం. అది రాయబడిన పరిశుద్ధ గ్రంథ వాక్య నెరవేర్పే కావొచ్చు. అది నెరవేర్చేందుకు ఉన్నత చదువులు చదువుకున్నవారు సహితం పోటీపడుట కడు విడ్డూరం. అలా ఎవరికి నచ్చిన బోధకుల్ని వారు పోగుచేసుకునే కాలమొస్తుందన్న పరిశుద్ధ గ్రంథం మాట ఈ తరం వారిలో నెరవేరుట బాధాకరం. ఎంత చదువు చదివినా.. వారు పరిశుద్ధ గ్రంథంలో అలా ఉందో లేదోయని పరీక్షింపకపోవుట దేవుని దృష్టిలో నేరమన్నది ఎరగాలి. విశ్వాసుల ఇంటికొచ్చి మాట్లాడిన వారు సహితం నెమ్మదిగా, ప్రేమ నటిస్తూ మాట్లాడాలన్న దానికి కట్టుబడిపోయారు. అట్టి వారికే విశ్వాసుల దగ్గర మనన్నన లభించుట ఓ వింత! బాగా చదువుకున్న విశ్వాసుల్లో కూడా ఇదే జాఢ్యం కనబడుతోంది. పరిశుద్ధ గ్రంథంలో ఉన్నదున్నట్లు మాట్లాడే వారంటే చదువుకున్న విశ్వాసులకే నచ్చనప్పుడు.. ఇక మామూలుగా ఆదివారాలు చర్చిలకెళ్లే వారికేం నచ్చుతారు. ఎవరేమన్నా.. ఏం చెప్పినా గుడ్డిగా నమ్మేయడమేనా? అది పరిశుద్ధ గ్రంథంలో అలా ఉందా లేదాయని పరీక్షించొద్దా? ఆలోచించాలి! గొప్ప గొప్ప చదువులు చదివాం, ఉన్నతోద్యోగాలు చేసాం.. చేస్తున్నాం.. అంటున్న వారైనా బోధకులు, పాస్టర్లు, లేక సువార్తికులు తదితర వ్యక్తులు చెప్పేది పరిశుద్ధ గ్రంథంకు అనుకూలమా కాదాయని పరీక్షించాల్సిందే. ఆ యా మాటలు మన కుటుంబాల్ని కట్టాలంటే అవి తప్పక దేవుని మాటలు.. వాటి భావములైయుండాల్సిందే. ఆ పూటకి ఆ యా మాటలు కాస్త బాధా కలిగించినా అవి దేవుని మాటలని ఎరిగి మనం మారాల్సిందేగాని అవి మారవు. ఎవరైనా సరే దేవుని ఇష్టాన్ని మనలో నెరవేర్చే మాటలు చెబుతున్నారా లేక మనల్ని బురిడీ కొట్టిస్తూ దేవుని సేవ ముసుగులో వారు ఆస్తులు పోగేసుకుంటున్నారా అన్నది విశ్వాసులు గమనించాలి. బోధకులు తాము బోధిస్తున్న మాటల్ని తాము, అలాగే విశ్వాసులు వింటున్న బోధల్ని విశ్వాసులు పరిశుద్ధ గ్రంథంలో రాయబడిన వాటిని బట్టి పరీక్షించుకోవాలి. అలా 'పరీక్షించకపోతే.. పోయేది నరకానికే అన్న దేవుని మాటల సారాన్ని అందరూ ఎరగాలి.

(ఇది మునుపటిదే. పాఠకుల కోరికపై కొద్దిపాటి మార్పులతో మరోసారి ఇవ్వడమైనది!)

ప్రభువు వాక్యము శీఘ్రముగా వ్యాపించి మహిమ పరచబడు నిమిత్తము..... మా కొరకు ప్రార్థించుడి ★

**గమనిక** అనేకమంది చందాదారులు, ప్రకటన కర్తల సూచనపై 'క్రైస్తవనాడు' స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అకౌంట్ నెంబరు ఇస్తున్నాం. ఇది 'క్రైస్తవనాడు' సబ్ - ఎడిటర్ మరియు డిజైనర్ బ్రదర్ వై.ధనరాజు కు సంబంధించినది. చందాదారులు, ప్రకటనకర్తలు తమ సౌకర్యాన్ని బట్టి ఈ క్రింది అకౌంట్‌లలో సొమ్ము జమచేయొచ్చని తెలియజేస్తున్నాం. - ఎడిటర్

| | |
|---|---|
| **CHRISTAVANAADU** | **Y.DHANA RAJU** |
| **Andhra Bank** | **State Bank of India** |
| ***Current A/C* : 13 96 111 00 00 00 52** | **S/B A/c No.: 34513409917** |
| IFS Code : ANDB0001396 | IFS Code : SBIN0010602 |
| Adarsha Nagar Branch, Visakhapatnam | Vishalakshi Nagar, Visakhapatnam |

**ఎడిటర్ కుటుంబీకులు వ్రాస్తున్న వివరణలన్నీ అప్పటికి తగినంతమాత్రమే. సంచలనాత్మక విషయాలు, త్వరలో అని ప్రకటించినవి వీలును బట్టి ప్రచురించగలం. కాబట్టి రాబోవు సంచికలను మిస్ కావద్దని కోరుతున్నాం.**

'వివేకియైనవాడు తన విద్యను దాచి పెట్టును' అన్న పరిశుద్ధ గ్రంథ వాక్యాన్ని బట్టి 'క్రైస్తవనాడు' స్వరచనల్లోగల వాక్యాలకు ★ గుర్తు ఇవ్వడమైంది.

'క్రైస్తవనాడు' - ఆధ్యాత్మిక, రాజకీయ, సామాజికంగా సంచలనాత్మక వివరణలు, వార్తలు, విశ్లేషణలతో లక్షలాది క్రైస్తవులకు మరియు ఇతరులకు పరిచయమైన పేరు!




రాబోవు దినములలో చిరకాలము వరకు నిత్యము సాక్ష్యార్థముగానుండునట్లు నీవు వెళ్లి వారి యెదుట పలకమీద దీని వ్రాసి గ్రంథములో లిఖింపుము. ★
ఎచ్చుతరము తెలిసికొనునట్లుగా ఇది వ్రాయబడవలెను సృజింపబడబోవు జనము యెహోవాను స్తుతించును. ★
ఈ మాటలు నమ్మకమును నిజమునైయున్నది గనుక వ్రాయుమని ఆయన నాతో చెప్పుచున్నాడు. ★

**'యథార్థ' రాతల్లో దమ్మున్న పేపరని పాఠకులిస్తున్న సాక్ష్యాన్ని బట్టి 'దేవునికి స్తోత్రం'.**

# దేవుని జ్ఞానం - మానవ విజ్ఞానం

హోలీ బైబిల్ / దేవుని మాట × సైన్స్ / శాస్త్రజ్ఞుల మాట

బ్రదర్ వై.లీలా రవిరాజు



**మ**నుష్యులను భూమి మీద దేవుడు చేసి, స్వాతంత్ర్యమిచ్చి వారు చేసిన కార్యాలను బట్టి దేవునికొచ్చే ఘనతను చూచి ఆనందించాలని దేవుడు కోరుకున్నారే గాని, వారి వల్ల వచ్చే చెడ్డ పేరును మాత్రం దేవుడు కోరుకోవడం లేదు. దేవుడే కాదు, భూమి మీద ఏ తండ్రీ తన కుమారుని వలన మంచిపేరే గాని చెడ్డపేరు వచ్చుట సహింపడు. దేవునికి సృష్టి ప్రారంభం నుండి మంచిపేరు కంటే చెడ్డపేరు వస్తూనే ఉంది. తుదకది దేవుడు సంతాపపడేందుకూ దారి తీసింది. ఇక మనుష్యులు మారరని దేవుడు మనుష్యులను చేసినందుకు హృదయములో నొచ్చుకొని భూమితోబాటు అప్పటి వరకు ఉన్న ప్రతీదాన్ని నాశనం చేయాలని అనుకున్నారు. **తాను భూమి మీద నరులను చేసినందుకు యెహోవా సంతాపము నొంది తన హృదయములో నొచ్చుకొనెను.** ★

అప్పటికాలంలో వారిని వెంటనే నాశనం చేయలేదు. నోవాహు అనే భక్తునికి ఓడ సిద్ధపరచమని దాని పరిమాణం దానికి కావలసిన వస్తువులను కూడా చెప్పి రక్షణ సువార్త ప్రకటింపజేశారు. దేవుడు అక్కడ కూడా మనుష్యులమీద తనకున్న ప్రేమను బట్టి ఒకరైనా మారకపోతారాయని సువార్తను ప్రకటింపజేసారు. **దేవుని దీర్ఘశాంతము ఇంక కనిపెట్టుచుండినప్పుడు పూర్వము నోవాహు దినములలో ఓడ సిద్ధపరచబడుచుండగా, అవిధేయులైన వారి యొద్దకు, అనగా చెరలో ఉన్న ఆత్మల యొద్దకు, ఆయన ఆత్మరూపిగానే వెళ్ళి వారికి ప్రకటించెను.** ★

వారు మారుతారని దేవుడు ప్రకటింపజేస్తే వారు మారుటకు బదులు, హేళన చేయుట మొదలు పెట్టారు. కాని, దేవుడిచ్చిన గడువు (ఓడకట్టిన దినాలు) పూర్తి అయిపోయినా ఒక్కరు కూడా మారకపోవటంతో దేవుడు జలప్రలళయాన్ని భూమిపైకి రప్పించగా, భూమి మీద ఉన్న ప్రతి దానిని ఆ జలప్రళయం తుడిచివేసింది. ఎనిమిది మందే ఆ జలప్రళయంలో నుండి రక్షింపబడ్డారు. **ఆ ఓడలో కొందరు, అనగా ఎనిమిది మంది నీటి ద్వారా రక్షణ పొందిరి.** ★

ఆ ఎనిమిది మందీ నోవాహు కుటుంబీకులు. నోవాహు, ఆయనకు పుట్టిన ముగ్గురు కుమారులు (షేము, హాము, యాపెతు) ఆయన కోడళ్లు మరియు ఆయన భార్య. అంటే ఆ ఇంటి వారే తప్ప బయటివారెవరు మారలేదని అర్ధమవుచున్నది. అంత పెద్ద ఓడను ఆ కుటుంబం నిర్మించలేదని మనం గ్రహించగలం. ఎందుకంటే ఒక అంతస్తు ఇల్లు కట్టడానికే పది ఇరవై మంది అవసరపడతారు. మరి అంత పెద్ద ఓడ కట్టించిన నోవాహు ఇంకెంత మంది పనివారిని పెట్టి ఉంటాడు? ఒకసారి ఆలోచించండి! అంటే ఆయన దగ్గర పనిచేస్తున్న ఓడ కట్టిన వారు కూడా మారలేదు. దేవుడు అబ్రహాముతో సాదొమా - గొమొఱ్ఱ పట్టణాలను నాశనం చేస్తున్నానని చెప్పి, ఆ ఊరిలో కనీసం 10మంది నీతిమంతులు వున్నా, నాశనం చేయనన్నారు.

అలాగే దేవుడు నీనెవె పట్టణాన్ని నాశనం చేయబోతున్నానని ఆ ఊరి ప్రజలకు, రాజులకు చెప్పమని యోనాని పంపించారు. కాని, సాదొమా - గొమొఱ్ఱ పట్టణాలలో నీతిమంతులు దేవుడు చెప్పిన సంఖ్యకన్నా తక్కువగా ఉన్నట్లు మనం గ్రహించుకోవాలి. కాబట్టి ఆ ఊరిని దేవుడు నాశనం చేసారు. నీనెవె పట్టణంలో నీతిమంతులు లేకపోయినను, ఆ వార్త విని పశ్చాత్తాపం చెంది రాజుతో సహా గోనెపట్ట కట్టుకొని దేవునికి మొఱ్ఱపెట్టుకున్నారు కాబట్టే వారు రక్షింపబడ్డారు. అదేవిధంగా నోవాహు కాలంలో మనుషులు అలా చేసుంటే దేవుడు నాశనం చేయకపోవును. ఎందుకంటే మారితే ఇష్టపడే దేవుడాయన. నాశనం చేయాలని దేవుడు ఎప్పుడు కోరుకొనరు. ఎందుకంటే నాశనం చేస్తే తన పిల్లలు తనకు దూరమైపోతారు. నరకాగ్నికి చేరువవుతారు. అది ఆయనకు ఇష్టంలేనిది. అదే మారితే తన చెంతకు చేరుతారని దేవుని ఆశ. అందువలన ఆయన దీర్ఘశాంతంతో ఎదురుచూస్తున్నట్లు లేఖనాలు తెలియజేస్తున్నాయి. తన పోలికలో పుట్టిన పిల్లలు తిరిగి తన యొద్దకే చేరాలన్నది ఆయన ఆశ.

క్రైస్తవనాడు డిటిపి, పేజ్‌మేకింగ్ & డిజైనింగ్ : జె.సి. డిజైన్స్ , మెదక్ & విశాఖ. ఫోన్ : 9866113513

**సం॥ చందా ₹ 200.** చందాదారులకు పెళ్లి, పుట్టినరోజు, స్మారక ప్రకటనలు **ఉచితం!** చందాదారులకు మాత్రమే రెగ్యులర్‌గా పంపబడుతుంది. పత్రిక అందని చందాదారులు ఉత్తరాల ద్వారా మాత్రమే ఆ సంగతి మాకు తెలియజేయాలి. లేకుంటే మేం బాధ్యత వహించలేం. చందాలు, ప్రకటనలకు సంబంధించిన సొమ్ముకు తగు రసీదు వెంటనే తీసుకొని 7981542666 / 9866113513 నంబర్లకు ఫోన్ చేయండి.

మీ రచనలు, వ్యాసాలు, ప్రసంగాలు, కవితలు, పద్యాలు, ఏవైనా సరే మేము ప్రచురించాలంటే భారతదేశ సార్వభౌమ త్వానికి, భారత రాజ్యాంగానికి భిన్నంగా ఉండరాదు. లోకోక్తులు, టిప్స్, జనరల్ స్టడీ బిట్స్ సేకరణలు, అలాగే మునుపటి సంచికల్లో గల కొన్ని శీర్షికలు అనేక మంది పాఠకుల కోరికపై మరలా వీలును బట్టి ఇస్తున్నాం. అందువల్ల కొన్ని రిపీట్ అవుతున్నాయి. ముందు జరిగినదే ఇప్పుడును జరుగును; జరుగబోవునది పూర్వమందు జరిగినదే; జరిగిపోయినదానిని దేవుడు మరలా రప్పించును. ★

'క్రైస్తవనాడు'లో ప్రచురించబడే ఇతరుల రచనలు ఆయా రచయిత / రచయిత్రిల వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే, పత్రిక పాలసీకి ఎటువంటి సంబంధం లేదు. అడ్వర్టైజ్ మెంట్స్‌పై స్పందించే ముందు క్షుణ్ణంగా విచారించుకోగలరు. ఈ పత్రికకు ఏ విధమైన సంబంధంలేదు.

**'క్రైస్తవనాడు' విస్తరించేందుకు చందాలు పంపి సహకరించగలరు. మీ అనుదిన కుటుంబ ప్రార్థనల్లో గుర్తుచేసుకోగలరు. మీ స్నేహితులకు పరిచయం చేసి ప్రోత్సహించుటయేగాక మీ పరిచర్య వివరాలూ తెలిపి ప్రచురింపజేసుకోగలరు.**

# నాయకత్వపు విలువలు



బిషప్.ఎం.ఎ.పాల్

నిస్సహాయమైన, నిరీక్షణ లేని గందరగోళ పరిస్థితిల్లో ఉన్న ప్రపంచములో మనం జీవిస్తున్నాము. దినదినానికి నైతిక విలువలు దిగజారిపోతున్నాము. జీవితములోని ప్రతి రంగములోను నాయకత్వపు లోటు హెచ్చుగా ఉన్నది. ఏ సమాజమైతే లోకరీతిలో స్థాపింపబడి లోకానుసారముగా కట్టబడుతుందో ఆ సమాజము తప్పకుండా శిధిలమైపోతుంది. గొప్ప సామ్రాజ్యాలైన ఐగుప్తు బబులోను మరియు రోమా సామ్రాజ్యాలు ఎన్నో తరాలు నిలిచియుండునట్లు గొప్ప ఆశయాలతో నిర్మింపబడినప్పటికి విచారకరమైన విషయమేమంటే అవికూడా అదృశ్యమై పోయినవి. జ్ఞాపకముంచుకొనదగిన విశేషాలేమీ మిగల్చకుండానే పూర్తిగా నాశనమైపోయినవి. కాని, స్థిరమైన రాజ్యము, మరియు అత్యున్నతమైన సార్వభౌమాధికారములు కలిగియున్న నాయకుడైన ప్రభువైన యేసు క్రీస్తు మనకున్నాడు.

యేసు క్రీస్తు రాజుగాను, నాయకునిగాను జన్మించెను. నాయకత్వమును గూర్చిన అద్భుతమైన పాఠములను క్రీస్తు యేసు యొక్క జీవితము నుండి నేర్చుకొనగలము. అపొస్తలుడైన పౌలు ఫిలిప్పి 2: 5-11లో క్రీస్తు తన్ను తాను తగ్గించుకొనే తత్వమును సేవకునిగా ఆయన పాత్ర యొక్క స్వభావమును, శైలిని ప్రత్యక్షపరిచాడు. ఇక్కడ క్రీస్తు ఏవిధముగా పరలోక మహిమను విడచి ప్రజలకు సేవ చేయుటకు ఒక సేవకుని బాధ్యతను తన మీద వేసుకొనిన విధానమును బట్టి తండ్రియైన దేవుడు భూమి మీదను, పరలోకములోను కూడా అత్యున్నత స్థానమునకు ఆయనను హెచ్చించెను. అదేమనగా ప్రతిమోకాలు ఆయన నామమున వంగునట్లును, ప్రతినాలుక యేసు ప్రభువని ఒప్పుకొనునట్లును హెచ్చించెను. సేవకుని స్థానమునుండి హెచ్చించబడుటకు మూలము తగ్గించుకొనే తత్వమని మనము గ్రహించగలము. ఇచ్చట సేవకుడు, నాయకుడు అను రెండు విధములైన స్వభావములను చూచుచున్నాము. సమర్థుడైన నాయకుడుగా ఉండవలెనంటే సేవకునిగా ఉండుట నేర్చుకోవాలి.

అధికారమును ఆశించుట ద్వారా అనేకసార్లు మనము ఇతరుల మనస్సును నొప్పించవచ్చు. అన్యులు కూడా అజ్ఞానము చేత ఇతరులపై తమ అధికారమును ఉపయోగించుదురు. లేఖనమందలి యేసు బోధలు నాయకుడు సేవకునిగా ఉండాలని తేటపరుచుచున్నవి. స్వయంగా యేసుక్రీస్తు కూడా ఈ లోకమునకు మనుష్యులకు సేవచేయుటకేగాని, సేవ చేయించు కొనుటకు రాలేదు. మార్కు 10:45 లో మనుష్య కుమారుడు పరిచారము చేయించుకొనుటకు రాలేదుగాని పరిచారము చేయుటకును, అందరికొరకు తన ప్రాణము అర్పించుటకు వచ్చెనని సెలవిచ్చాడు.

ధర్మశాస్త్రప్రవీణుడు, సెన్‌హెడ్రీన్ సభలో అధికారముగల ప్రసిద్ధిచెందిన నాయకుడునైన పౌలు తిరిగి లేచిన క్రీస్తు చేత సంధింపబడిన తరువాత అతని జీవితము పూర్తిగా రూపాంతరము చెందినది. మూడు సంవత్సరములు అరేబియా దేశములో ఉండి విజయవంతమైన జీవితమునకు రహస్యాన్ని మరియు ప్రభువైన యేసు క్రీస్తు యొక్క నమ్మకమైన శిష్యుడుగా ఉండుటకు నేర్చుకొనెను. తాను యేసుక్రీస్తు యొక్క "డ్యూలాస్" అని వ్యాఖ్యానించెను. ఒక బానిసకు ప్రత్యేకమైన హక్కులు కాని, ఆధిక్యతలు కాని ఉండవు. అతడు తన యజమాని ఆజ్ఞలకు విధేయత చూపవలసినదే. ఇతరులను ప్రభావితము చేయగల ప్రతిభావంతమైన నాయకత్వము లోబడుట అనే మాదిరి ద్వారానే చూపించగలము. (పిలిప్పి 3:17) సహోదరులారా, మీరు నన్ను పోలి నడుచుకొనుడి, మేము మీకు మాదిరియైయున్న ప్రకారము నడుచుకొను వారిని గురిపెట్టి చూడుడి. అందుచేత పౌలు తీతుకు మాదిరి కరమైన మంచిపనులు చేయవలెనని హెచ్చరించెను.

తీతు 2:7 "పరపక్షమందుడువాడు మనలను గూర్చి చెడుమాట యేదియు చెప్పనేరక సిగ్గుపడునట్లు అన్నిటి యందు నిన్ను నీవే సత్కార్యములు విషయమై మదిరిగా కనబరుచుకొనుము. నీ ఉపదేశము మోసములేనిదిగాను మాన్యమైనది గాను నిరాక్షేపమైన హిత వాక్యముతో కూడినదిగాను ఉండవలెను'. పౌలు ఇట్టి సలహానిచ్చి పెద్దలను ఏర్పాటు చేయుటకు తీతును క్రేతులో విడిచి పెట్టెను.

తీతుకు 1:5 "నేను నీ కాజ్ఞాపించిన ప్రకారము నీవు లోపముగా ఉన్న వాటిని దిద్ది, ప్రతి పట్టణములోను పెద్దలను నియమించుట నిమిత్తమే నేను క్రేతులో నిన్ను విడిచి వచ్చితిని". ఎందుకనగా క్రేతునందలి సంఘములో ఎటువంటి లోపములు కలిగియున్నదో ఈ క్రింది వచనములు ద్వారా మనము గ్రహించగలము. (తీతు 1:10-12). దేవుని ఎరుగుదమని వారు చెప్పుచుందురు గాని, అసహ్యులను, అవిధేయులను ప్రతి సత్కారము విషయము భ్రష్టులునైయుండి, తమ క్రియలవలన ఆయనను ఎరుగమన్నట్టున్నారు. (తీతు 1:16). ఇట్టి జనుల మధ్య తీతు నాయకత్వము వారిని ప్రభావితము చేసి అచ్చటి సేనను స్థిరపరచెను.

**<u>నాయకునికుండవలసిన అర్హతలు:</u>**

ఒకడు శిష్యుడు కాకుండా నాయకుడు కాలేడు. ఒక నాయకుడు యధార్థవంతుడై యుండాలి. దర్శనము కలవాడై యుండాలి. (సామెతలు 29:18)

సామెతలు 28: 18"యదార్ధముగా ప్రవర్తించువాడు రక్షింపబడును. మూర్ఖప్రవర్తన గలవాడు హటాత్తుగా పడిపోవును". నాయకుడు దేవుని యొక్క ఉద్దేశ్యమును, ప్రణాళికను ఎరిగినవాడై విధేయతకలవాడై యుండాలి. ఇతడు పాపముతోను, లోకముతోను, ఎన్నడూ రాజీపడనివాడై యుండాలి. భవిష్యత్తును గూర్చి సరియైన గ్రహింపు కలిగి, ప్రణాళికబద్ధంగా జీవించె వాడై యుండాలి. ఎటువంటి భాద్యతనైన స్వీకరించువాడై యుండాలి. పరిపక్వమైన స్థితికలవాడై యుండాలి.

మరి ముఖ్యముగా నాయకుడు కాపరి హృదయమును కలిగిన వాడై వాక్యమును భోధించగల సమర్థుడై యుండవలెను. అతడు తన కుటుంబ వ్యవహారములను, సేవాభారాన్ని సమర్థవంతముగా నిర్వహిస్తూ తన మాదిరికరమైన జీవితము ద్వారా ఇతరులను నడిపించలగాలి. ఇతరులను నడిపించవలెనంటే నాయకుడు ప్రతిభావంతుడుగాను, అధికారముతో కూడిన జయ జీవతము కలిగి ఏ విషయమునందును రాజీపడనివాడుగా ఉండవలెను. (తీతు 1:5-9).

ఇటువంటి దైవిక నాయకత్వపు ఆవశ్యకత ఈనాడు ఎంతో ఉంది. తన ప్రజలను సరియైన మార్గములో నడిపించుటకై సమర్థులైన నాయకుల కొరకు దేవుడు వెదుకుచున్నాడు.

యిర్మియా 23:3,4"మరియు నేను వాటిని తోలివేసిన దేశములన్నిటిలో నుండి నా గొర్రెల శేషమును సమకూర్చి తమ దొడ్లకు వాటిని రప్పించెదను. అవి అభివృద్ధిపొంది విస్తరించును. ఇక మీదట అవి భయపడకుండను బెదిరిపోకుండను వాటిలో ఒకటైనను తప్పిపోకుండను వీరు నా గొర్రెలను మేపెదరు ఇదే యెహోవా వాక్కు".

ఈలాంటి దైవిక లక్షణములు గల నాయకులను దేవుడు లేపును గాక. ఆమెన్.



**బైబిలుపై అనేకులకున్న సందేహాలను, ప్రశ్నలను పటాపంచలుగావించే... దుర్భోధకులకు చెక్ పెట్టే....?! అనేక మర్మగర్భ వాక్య సారాంశాలు సులువుగా నేర్పే...**

**'దేవుని జ్ఞానము చెప్పినదేమనగా '**

**దేవునికి పక్షపాతం లేదు.. అందరి హృదయాలు ఒకటే!**

## హృదయంలో నిండేదేంటి?

**మ**నలో ప్రతి తరంలోను ఒకరికొకరికి మధ్య అనేక భేదాభిప్రాయాలుండుట చూస్తున్నాం. వ్యక్తిగత జీవితాల్లో అభిప్రాయాభేదాలుండుట సహజమే! కానీ... దేవుని వాక్యంలోను, సంఘాల నడుమ పద్దతుల్లోను భేదాలుండుట విన్నవారికి చూసేవారికి అసహజంగా కన్పిస్తాయి. అందువల్ల అనేకచోట్ల దైవవాక్య వ్యతిరేక శక్తులు ప్రబలుచుండుట కూడా చూడగలం. దీనంతటికి ఒకేఒక కారణం మనలో అనేకులు లేఖనాలను దైవోద్దేశంతో హృదయాల్లో నింపుకొనకపోవుటేనన్నది నిర్వివాదాంశం. దేవుని వాక్యంలో మానవ హృదయానికెంతో ప్రాముఖ్యముంది. కాబట్టి మన హృదయం ఎలా ఉండాలి? ఎక్కడ ఉండాలి? ఏం చేయాలన్నది ఎరుగుట నేడెందరికో అత్యవసరం. అది ఎరిగిన వారందరూ దేవునిలో ఎదుగుతూ మరనేకులకు ఆదర్శంగా జీవించగలరు.

ముందుగా మన హృదయం ఎలా ఉండాలి? అన్న ప్రశ్నను గూర్చి లేఖనం ఏం చెప్పింది? దేవుడు మనల్ని నిరించేప్పుడు మన హృదయాన్ని ఎలా నిర్మించారో అలానే ఉండాలి. మనం ఎదుగుతున్న కొలది ఆ హృదయంలో దేవుని వాక్యాలే నిండాలి. తద్వారా మన బ్రతుకు పండాలి. దేవునికి పక్షపాతమేమియు లేదని లేఖనాలను బట్టి మన మెరుగుదుము. కాబట్టి పక్షపాతమేమియు లేని దేవుడు భూలోకనివాసులందరి హృదయాలను ఒకేలానే నిర్మించారని లేఖనం సాక్ష్యమిస్తుంది.

**భూలోక నివాసులందరి వైపు ఆయన చూచుచున్నాడు. ఆయన 'వారందరి' హృదయములను ఏకరీతిగా నిర్మించినవాడు. ★**

పై వాక్యాన్ని బట్టి దేవుడు మన (లోకులందరి) హృదయాలను ఏకరీతిగా చేసారని గ్రహించగలుగుతున్నాం. హృదయమనేది మనుష్యుల్లో ఒక ఖాళీ జాగా లాంటిదని గ్రహించాలి. ఆ ఖాళీ చోటులో ఏవైనా నిలుపుకోవచ్చు. అవి మంచి మాటలైనా, చెడుమాటలైనా. ఎందుకంటే మన ప్రభువైన యేసుక్రీస్తు మాటల్లో.. హృదయం 'నిండిన' దాని బట్టి నోరు మాట్లాడుతుందని కన్పడుతుంది. కాబట్టి మానవులెవరైనా తమ తమ జీవితాలను నడుపుకొనేందుకు హృదయమన్నదే మఖ్యమని గ్రహించాలి. హృదయంలో నిండింది మనిషి మస్తిష్కంలో రూపుదిద్దుకొని ఆ మనిషిని నడిపిస్తుందని పరిశుద్ధగ్రంథంనందున్న లేఖనాలను బట్టి గ్రహిస్తున్నాం. అందువల్ల హృదయాన్ని గూర్చి 'లేఖనాలు' ఏం వెల్లడి పరుస్తున్నాయో గ్రహించాలి. వాటిని మన బ్రతుకుల్లో అన్వర్తించుకొని ప్రభువన్నట్లు లోకానికి మనమొక వెలుగులా ప్రకాశిద్దాం. తద్వారా యేసుక్రీస్తు నెరుగని వారెందరికో ఆయనను గూర్చి ప్రకటిద్దాం. తండ్రియైన దేవుని చిత్తాన్ని మన కుటుంబాల్తో సహా మహిమపరుద్దాం. ఇక హృదయాన్ని గురించి....

హృదయమన్నది ఓ ఖాళీగానున్న భాగమని పైన మనం చెప్పుకున్నాం. దాంట్లో ఏవి నింపుకుంటే అవసరానికి వాటినే మనం వాడగలం. కాబట్టి మన ప్రభువైన యేసుక్రీస్తు వారి మాటలను బట్టి మన హృదయాల్లో నింపుకొనే వాటి విషయమై జాగ్రత్త పడదాం. మన హృదయాల్లో ఏవేమి నింపితే మనమనే మాట్లాడతామని చెప్పిన యేసు పలికినదోసారి చదువుతూ ముందుకు సాగుదాం...

**హృదయమందు నిండియుండు దానినిబట్టి నోరు మాటలాడును గదా. ★**

పై వాక్య భావాన్ని బట్టి మన హృదయమనే ధననిధిలో దేవుని గూర్చిన మాటలు నింపుకోవాలి. ఎప్పట్నుంచి నింపుకోవాలి? బాలుడుగా ఉన్నప్పట్నుంచే నంటుంది పరిశుద్ధ గ్రంథం. అవి మన నోటనుండి బయటకొచ్చేటప్పుడు మన కుటుంబీకులు, స్నేహితులే గాక వినిన వారనేకులకు ఆదరణతో బలపరుస్తాయి. తద్వారా వారూ దేవునిలో ఎదిగి లోకానికి తమవంతు సేవ తాము చేయగలరు. మరణపర్యంతము దేవుని యొద్దకు తమ ఆత్మను చేర్చుకొను భాగ్యాన్ని పొందగలరు. ఇందుకు విరుద్ధంగా ఎవరైనా చెడువిషయాలతో తమ హృదయాన్ని నింపుకొంటుంటే వారంతకంతకు చెడిపోయి తమ తరమువారికి కంటకులుగా మార్తారనుటకు ఎటువంటి సందేహమును లేదన్న పరిశుద్ధ గ్రంథ పండితుల మాట ఎంతైనా ఆలోచించదగిందే!

**<u>పాఠకులకో మనవి!</u>**

**'క్రైస్తవనాడు' పేపరు మరియు "రాజ్ 'ఎన్' రాజ్స్ ఛారిటబుల్ ట్రస్ట్" ద్వారా జరిగే సేవలు మరింత విస్తరించి అనేకుల అక్కరలు తీర్చేందుకు మీ కుటుంబ ప్రార్థనల్లో గుర్తుచేసుకోవాలని కోరుతున్నాం- 'క్రైస్తవనాడు' కుటుంబాలు, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలు.**

# మన పిల్లలు దేవుని పిల్లలు


రెవ.టి.ఎ.ప్రభుకిరణ్
హైద్రాబాద్

దావీదురాజు గురించి మనం ఎంత చెప్పుకున్నా తక్కువే. స్వభావరీత్యా మనందరిలాంటివాడే అయినా దేవునితో ఆయనకున్న అనుబంధం మాత్రం ఎంతో అసాధారణమైనది. ఎన్నో ఒడుదుడుకులతో సాగిన జీవితంలో ఆయన సాధించిన విజయాలు బోలెడు. అయితే తన తరువాత సింహాసనాన్ని అధిష్టించనున్న తన కుమారుడైన సొలోమోను కోసం తండ్రిగా దావీదు దేవుని నుంచి పొందిన వాగ్దానం ఆ విజయాలన్నింటికెల్లా అత్యంత ప్రాముఖ్యమైనది. 'నేను అతనికి తండ్రిగా ఉంటాను. అతడు నాకు కుమారుడుగా ఉంటాడు' (1దిన.17:13) అన్నది తన కొడుకు కోసం ఆయన పొందిన వాగ్దానం. ఒకవేళ ఇదే వాగ్దానాన్ని దేవుడు మన పిల్లలకు సంబంధించి మనకు కూడా ఇవ్వగలిగితే అంతకన్నా ఏంకావాలి?

పరీక్షల్లో 99 మార్కులొచ్చినా, ఒక మార్కు తగ్గిందంటూ పరీక్ష రాసిన పిల్లాడు అతని తల్లిదండ్రులూ వాపోతున్న పోటీ సమాజంలో నేడు మనం ఉన్నాం. ఒకప్పుడు మన తల్లిదండ్రులు తమకున్న గంపెడు పిల్లలకోసం పడిన హైరానా కన్నా, మనం మనకున్న ఒకరిద్దరు పిల్లలకోసమే ఎన్నోరెట్లు ఎక్కువగా హైరానాపడే పరిస్థితులున్నాయి ఈనాడు. పిల్లలకోసమే మన ఆదుర్దా. క్షణక్షణానికీ అనూహ్యమైన వేగంతో మారుతున్న ప్రస్తుత పోటీ సమాజంలో ఆ వేగాన్ని అందుకోవడానికి ఆరాటపడే తల్లిదండ్రులు అందరూ కాగా, ఆ వేగాన్ని అందుకోలేక చతికిలపడేవాళ్ళే అందులో చాలామంది. ఈ నేపథ్యంలోనే దేవుడు దావీదుకిచ్చిన వాగ్దానాన్ని విశ్వాసులైన ప్రతి తల్లి తండ్రి తమ పిల్లలకోసం స్వతంత్రించుకోవాలి. 'మన పిల్లలు దేవుడు మనకిచ్చే బహుమానాలు' అని బైబిలు చెబుతోంది (కీర్తన 127:4) అందుకే ఆ బహుమానాల్ని తిరిగి ప్రభువుకే అప్పగించి, పరలోకపు తండ్రిగా నా పిల్లల భవిష్యత్తును తీర్చి తిద్దమంటూ మనం ప్రభువు సన్నిధిలో వారికోసం ప్రార్థించ గలిగితే, మన పిల్లలకు అదే మనం ఇవ్వగలిగిన అమూల్యమైన కానుక. మన పిల్లల కోసం ఎంతో ప్రయాసపడతాం. కాని వారి కోసం ఎంత సమయాన్ని మనం మోకాళ్ళమీద ప్రార్థనలో గడుపగలుగుతున్నాం? అన్న ప్రశ్న తప్పక మనం వేసుకోవాలి. మన పిల్లలకు ప్రభువే పరలోకపు తండ్రిగా ఉంటే, వారి భవిష్యత్తు ఎంత అద్భుతంగా ఉండగలదో ఆలోచన చేయండి. మన పిల్లలు ముందుగా దేవుని గురించి తెలుసుకోవాలి. అందుకు తల్లిదండ్రులుగావారిని మనం ప్రోత్సహించాలి. మన పిల్లల జయకరమైన జీవితానికి, భవిష్యత్తుకు వారు దేవున్ని తెలుసుకొని ఆ దేవునితో అనుబంధం పెంచుకోవడమే పునాదిగా మారుతుంది. 'మీ చింత యావత్తూ నామీద వేయండి' అని ప్రభువే స్వయంగా మనకు చెబుతుండగా (1 పేతురు 5:7) మన పిల్లల భవిష్యత్తు గురించి మనం ఇక చింతింపవలసిన పనిలేదు. 'నా పిల్లలకు మీరు తండ్రిగా ఉండండి. వారిని మీకు కుమారులుగా కుమార్తెలుగా స్వీకరించండి' అని అనుదినం మనం ప్రార్థించగలిగితే, మన పిల్లలు సమాధానంతో, ఆనందంతో నిండిన అందమైన భవిష్యత్తుకు తప్పక వారసులమవుతారు. ఆ పనికి ఈ రోజునుండే మనం పూనుకోవాలి మరి. ఇది ఆలస్యం చేసే విషయం అసలే కాదు.

## లోకోక్తులు

❖ పిల్లల్లో ఏదైనా మార్పుతీసుకురావాలంటే అది పెద్దలను కూడా మార్చగలదా లేదా అని పరిశీలించు కోవాలి. - కార్ల్ జంగ్

❖ అసహనం, బద్ధకం ఈ రెండు ముఖ్యమైన పాపాలు. వీటినుండే మిగతావి ఉద్భవిస్తాయి - ఫ్రాంజ్ కాఫ్కా

❖ తెలివైన వారు తెలుసు కాబట్టి మాట్లాడతారు. తెలివిలేని వారు మాట్లాడాలి కాబట్టి మాట్లాడతారు. - ప్లేటో.

❖ ఆత్మవిశ్వా సంతో కృషిచేస్తే అందుకోని శిఖరాలుండవు - అబ్రహాం లింకన్.

# ప్రార్థనా శక్తి


డా.పి.బి.మనోహర్
తెనాలి

నీతిమంతుని విజ్ఞాపన మన:పూర్వకమై బహుబలముగలదై యుండును (యాకోబు 5:16)

పాస్టర్ సుధీర్ చక్కగా ప్రసంగం చేస్తారని పేరు పొందారు. ఆయన సంఘము క్రమేపీ పెద్దదయింది. ఆయన ప్రసంగం వినటానికి అనేకులు తరలి వచ్చేవారు.

ఆయన ప్రసంగం చేయునప్పుడు ఒక వృద్ధుడు చివరి బెంచీలో కూర్చొని ఉండేవాడు. అతనిని ఎప్పుడు చూచినా కళ్లు మూసుకునే ఉండేవాడు. తాను ఇంత ఆసక్తికరమైన ప్రసంగము చేస్తున్నా ఆ వృద్ధుడు నిద్రపోతున్నాడని సుదీర్ విసుగుకొనేవారు. ఒకరోజు సుదీర్ దేవునిని ప్రార్థిస్తూ "ప్రభువా! నాకు యింత మంచి జ్ఞానము ఇచ్చినందుకు వందనములు. నీవిచ్చిన జ్ఞానము వలననే నేను ఇంత చక్కని ప్రసంగము చేయగలుగుతున్నాను. అనేక మందిని మార్చగలుగుతున్నాను" అన్నారు. అప్పుడు ప్రభువు స్వరము అతనితో "నీ ప్రసంగము వలన అనేకులు మారుట లేదు. ప్రజల హృదయాలు కదిలింప బడుటకు కారణము చివరి బెంచీలో కూర్చుని ప్రార్థిస్తున్న వృద్ధుని విజ్ఞాపనలే" అని పలికింది.

జీన్ వేనియర్ అనే భక్తుడు "ప్రపంచములో గొప్ప విషయములు జరుగుటకు ఎవరికీ తెలియని వ్యక్తుల ప్రార్థనయే కారణము. నేను పలికే ప్రతి మాటకు ముందు అనేక మాటలను దేవునితో పలకాలి. ప్రజల కొరకు దేవుని యొద్దకు నేను వెళ్లాలి. ప్రజల యొద్దకు దేవుని కొరకు వెళ్లాలి" అని అన్నాడు. సువార్త మర్మమును ధైర్యముగా తెలియజేయుటకు నేను మాటలాడ నోరు తెరచినప్పుడు దానిని గూర్చి నేను మాటలాడ వలసినట్లుగా ధైర్యముతో మాటలాడుటకై వాక్శక్తి నాకు అనుగ్రహింపబడునట్లు నా నిమిత్తము పూర్ణమైన పట్టుదలతో విజ్ఞాపన చేయుచు అని పౌలు భక్తుడు కోరుచున్నాడు. (ఎఫెసీ 6:19,20)

# ఆనందమే జీవిత మకరంధం


పి.ఇమ్మానుయేలు,
చీఫ్ మేనేజరు(రిటైర్డ్)
భారతీయ స్టేట్ బ్యాంక్, విశాఖ.

సృష్టిలో మానవులకు తప్ప మరి ఏ ఇతర జీవజాతికి లేని అవకాశం - సంతోషంగా గడపగలగటం - ఏడవడానికైతే ఏదో ఒక కారణం కావాలి. నవ్వడానికి ఏ కారణమూ అక్కరలేదు. అందాన్ని, ఆనందాన్ని ఆరోగ్యాన్ని పెంపొందించే అద్భుతమైన ఔషదం నవ్వు. ఎంతగా అలంకరించుకొన్నా రాని అందం, ఆనందంగా నవ్వుతూ ఉన్నప్పుడు వస్తుంది ఆనందమే అందం. అందమే ఆనందం. ఆనందమే జీవిత మకరందం.

సంతోషం మానసికమైనా, దాని ప్రభావం శారీరకపరంగాను ఉంటుంది. మనసు ఉత్సాహంగా ఉన్నప్పుడు శరీరంలో ఉత్పత్తి అయ్యే హార్మోన్లు రోగనిరోధక శక్తిని పెంచుతాయంటారు. సంతోషమే ఆరోగ్య ప్రదాయిని, సంతోషమే సగం బలం. సహజబలం. అందువల్ల ఆనందమే ఆరోగ్యం. ఆరోగ్యమే మహాభాగ్యం.

అన్ని కళల్లోనూ, జీవించడమే గాక కళ జీవితంలో సంతోషాన్ని ఆస్వాదించేవారే కళావేత్తలౌతారు. నా జీవితంలో అనేక సమస్యలున్నాయి. కానీ, ఆ సంగతి నా పెదవులకు తెలియకపోవుట వల్ల అవి నవ్వుతూనే ఉంటాయి. నవ్విస్తూనే ఉంటాయి. అని చమత్కరించేవారు ప్రపంచ ప్రఖ్యాత హాస్యనటుడు 'చార్లీ చాప్లిన్'. సంతోషమే స్వర్గం. దు:ఖమే నరకం అని మేధావులు ఏనాడో బోధించారు. స్వర్గంలాంటి సంతోషాన్ని సొంతం చేసుకోవాలంటే ఎక్కడికో వెళ్లనవసరం లేదు. ఏదో చేయనక్కరలేదు ఉన్న స్థితిలో సంతోషంగా ఉండలేకపోతే నువ్వెక్కడికి వెళ్ళినా, ఎలా మారినా సంతోషంగా ఉండలేవు. అలాంటి సంతోషాన్ని మనిషి పొందడం ఎలా? అతడి మనసే ఒక మహా మంత్రదండం. దానితో జీవితాన్ని ఆనంద బృందావనంగా మార్చుకోవడం అతడి చేతుల్లోనే, చేతల్లోనే ఉంది.

సంతోషానికి చిరునామా ఎక్కడోలేదు. 'నిన్ను వలె నీ పొరుగువానిని ప్రేమించు' అని చాటిచెప్పిన మన ప్రభువైన యేసుక్రీస్తు బోధనను పాటించునప్పుడు ప్రపంచం ఆనందమయమౌతుంది. దు:ఖము కలిగినప్పుడు ఇతరులతో పంచుకుంటే అది సగమవుతుంది. ఆనందం కలిగినప్పుడు నలుగురికీ పంచిపెడితే అది రెట్టింపు అవుతుంది.

ఏ స్త్రీకైనను పదివెండి నాణెములుండగా వాటితో ఒక నాణెము పోగొట్టుకొంటే ఆమె దీపము వెలిగించి ఇల్లు ఊడ్చి అది దొరుకు వరకూ జాగ్రత్తగా వేతకదా? అది దొరికినప్పుడు తన చెలికత్తెలను, పొరుగువారిని పిలిచి - నాతో కూడ సంతోషించుడి నేను పోగొట్టుకొనిన నాణెము దొరికినదని వారితో చెప్పునుగదా - లూకా 15:8-10.

ఒకచోట చిత్ర కళా ప్రదర్శన జరుగుతోంది. అక్కడ తమ చిత్రాలను అమ్ముకోవాలని వచ్చిన చిత్రకారులు 'వచ్చినవారికి మా చిత్రాలు నచ్చుతాయో లేదో.. వాళ్ళు మా చిత్రాలను కొనుక్కుంటారో లేదో' అని ఆందోళన చెందుతుంటారు. చిత్రాలను కొనుక్కోవడానికి వచ్చిన వారు 'ఇది ఇంత ధర చేస్తుందోలేదో? అని లోలోపల సతమతమవుతున్నారు. కేవలం చూడడానికి వచ్చిన కళాభిమానులు మాత్రం అందులోని కళాభిమానాన్ని ఆస్వాదిస్తూ, ఆనందిస్తూ కనిపించారు. ఎందుకంటే అక్కడున్న ఏదీ వాళ్ళ సొంతం కాదు గనుక సొంతం చేసుకోవాలన్న కోరిక వాళ్ళకులేదు.

మనిషి జీవితంలో స్థిత ప్రజ్ఞత కలిగి ఉన్నప్పుడు కంటికి కనిపించిన ప్రతి ఒక్కటి సొంతం కావాలనే స్వార్థపూరిత కోరికను విడిచిపెట్టినప్పుడు ఇతరులకు నిస్వార్థంగా సహాయం చేసే మనస్సు కలిగినప్పుడు స్వార్థ ప్రపచం తనదే అనిపిస్తుంది. అప్పుడు అతడు ప్రేమను అంతటా పంచే విశ్వమానవుడిగా మారతాడు. అదే అతనికి ఆనందం ఇస్తుంది. సంతోషమే స్వర్గమన్నది అతడి అనుభవానికి తెస్తుంది.

జీవితం అత్యంత అమూల్యమైనది. అపురూపమైనది. ఏదోవిధంగా బ్రతకడానికి కాదు. ఆనందంగా జీవించడానికే ఈ జీవితం ఉంది. సమయాన్ని కేవలం వినియోగించడంలేదు. దాన్ని సద్వినియోగం చేసుకోవాలి, ఆనందానుభూతిని సాధించడమే అతడి లక్ష్యం కావాలి. అప్పుడే జీవితం సార్థకమవుతుంది!

Raj 'n' Raj's Charitable Trust
Regd. No. : 297/2016

రాజ్ 'ఎన్' రాజ్స్ ఛారిటబుల్ ట్రస్ట్ రి.నెం.: 297/2016




మాకున్నంతలోనే అవసరాల్లో ఉన్న ఎందరికో సహకరించుట మొదట్నుంచి మాకు అలవాటు. ప్రభువైన యేసు కృపవల్ల దేవుని దయతో క్రీ.శ.2006లో 'క్రైస్తవనాడు' పేపరు ప్రారంభ మైంది. అప్పట్నుంచి దేవుని దయ మనుష్యుల దయతో 'క్రైస్తవనాడు' వర్ధిల్లుతూనే ఉంది. అలా వర్ధిల్లినకొలదీ సేవా కార్యక్రమాలు పెంచుకొంటూ వచ్చాం. ఇకపై ఆ యా కార్యక్రమాలు మరింత విస్తరించేందుకు శ్రీమతి మంగమ్మ ఫౌండర్‌గా ప్రారంభమైనదే "రాజ్ 'ఎన్' రాజ్స్ ఛారిటబుల్ ట్రస్ట్" అని సవినయంగా అందరికీ తెలియజేస్తున్నాం. ఈ ట్రస్ట్‌కు ఎవరు ఎటువంటి సహకార మందించినా ఆ యా సహకారాలు అవి అందాల్సినవారికి నేరుగా.. సక్రమంగా.. అందేట్లు చేయడమే మాకోలక్ష్యం. అందుకు మా ప్రయత్నం మేం చేస్తాం. మీ కుటుంబ ప్రార్థనా సహకారాలు ఆ పనిలో మాకెంతో తోడ్పడగలవు. మేం ఏ కార్యక్రమం జరిపినా అది దేవునికి మహిమ తెచ్చేట్లు, సహకారం పొందేవారు సంతోషించేట్లు, ట్రస్ట్‌కు సహకరించేవారు మెచ్చేట్లు, తద్వారా అందరూ దైవాశీర్వాదాలు పొందేట్లుం డాలన్నది మా ఆశ. అందుకే మీ ప్రార్థనలు కోరుతున్నాం. వీలునుబట్టి మరిన్ని విషయాలను మీతో పంచుకొంటూనే ఉంటాం. యేసు కృపలో మనందరి తండ్రియైన దేవుడే సాక్షిగా.. ప్రభుసేవలో.. ప్రజాసేవలో..

మీరు అభిమానించే మరియు మీకోసం కుటుంబ ప్రార్థనలో ప్రతిదినం గుర్తుచేసుకొనే.. - బ్రదర్ వైకెయార్ & ఫ్యామిలీ,
తెలుగు రాష్ట్రాలు.

Website : rajnrajscharitabletrust.weebly.com
Email : rajnrajscharitabletrust@gmail.com

# ప్రకటన గ్రంథము 19

'ప్రకటన గ్రంథం' పై వివరణలు ఇప్పటివరకు మీరు రకరకాలుగా వినుంటారు! అందుకు సంబంధించి ఓ వివరణ సీనియర్ పాస్టర్ ఎ.యం.అబ్రహాంగారి కలం నుంచి 'క్రైస్తవనాడు'కు ప్రత్యేకం!



తెలంగాణ రాష్ట్రం, సంగారెడ్డి జిల్లాలో నివాసముంటున్న **పాస్టర్ ఎ.యం.అబ్రహాము** గారు ఏడు పదుల వయసులోనూ నిత్యం పరిశుద్ధగ్రంథాన్ని ధ్యానిస్తూ.. రచనలు చేస్తూనే ఉంటారు. సత్యాన్ని ఉన్నదున్నట్లు సమాజానికి అందించాలన్న ఆశయాన్ని పుష్కలంగా కలిగిన సీనియర్ పాస్టర్ రెవ.అబ్రహాము గారు అనుట అతిశయోక్తికాదు. వీరెంతో అనుభవజ్ఞులు.. నిగర్వి. అది వారింటికి వెళ్లేవాళ్లకి స్పష్టంగా కనబడుతుంది. వారి ఇతర రచనలు కూడా దీని తరువాత పాఠకులు చదువగలరు – **ఎడిటర్.**

# 10వ అధ్యాయము

## ప్రకటన 10:1 నుండి 1:2 వరకు

10వ అధ్యాయములో మనము చదువుచున్న బలిష్ఠుడైన దూత ఆయన యేసుక్రీస్తు. 10:5లో అతడు తన కుడి చేయి పైకెత్తి ప్రవక్తల ప్రవచనములు నెరవేరును అని ప్రమాణము చేయుచున్నాడు. అనగా సాతానుడు పడద్రోయబడుతాడు. (12:7-12, ఆది 3:15, యెషయా 24:21, 25:7, 27:1, ప్రకటన 12:12) ఆ తరువాత ఈ లోక రాజ్యము మన ప్రభువు రాజ్యము ఆయన క్రీస్తు రాజ్యము మన అగును (ప్రకటన 11:15) అనగా సాతానుడు పడద్రోయబడిన తరువాత యేసు క్రీస్తు ఈ లోకమును 1000 సంవత్సరములు పరిపాలిస్తాడు (ప్రకటన 20 అధ్యాయము) ఆ తరువాత ఉన్న నిత్యత్వములో సాతానుడు లేడు (ప్రకటన 21, 22 అధ్యాయములు).

### బలిష్ఠుడైన దూత యేసుక్రీస్తు అనుటకై ఋజువులు

1. ఈ 10 అధ్యాయము మరియు ప్రకటన 1:12-16 మరియు దానియేలు 10:5-6 చదివినపుడు ఆ పోలికలు ఈ దూత యేసుక్రీస్తు అని ఋజువు పరుస్తాయి.
2. ఇతని చేతిలో పుస్తకము కలదు (10:8) ఈ పుస్తకము యేసుక్రీస్తు పొందుకున్నాడు (ప్రకటన 5:5-7) దాని ముద్రలు ఆయనే విప్పినాడు (ప్రకటన 6:1 నుండి 8:1)
3. తన సింహగర్జన 10:3 (యెషయా 31:4-5, యిర్మియా 25:29-36, హోషేయ 1:10-11, యోవేలు 3:16, ఆమోసు 3:8)
4. యేసు ప్రమాణము చేసాడు (10:6) దూతలు ప్రమాణము బైబిలులో ఎచ్చటను చేయలేదు.
5. 11:3 లో నా అధికారము ఇస్తాను అని యేసు చెప్పుట
6. వ్రాయమని, వ్రాయకూడదని యోహానుతో యేసు మాత్రమే చెప్పాడు (10:4, 1:1, 1:19, 2:1, 2:8, 2:12, 2:18, 3:1, 3:7, 3:12, 3:14, 14:3-4, 19:9, 21:5).

దానియేలు ద్వార చెప్పబడిన 70వ వారము అనగా 7 సంవత్సరముల శ్రమల కాలము 6:1 నుండి 18:24 వరకు చూడగలము. ఈ 70వ వారము గురించి దానియేలు 9:27లో చదువగలము. ఇప్పటికి 7 సంవత్సరములయందలి మొదటి 3 1/2 సంవత్సరములు గతించినవి. ఇపుడు 10:1 నుండి 18:24 వరకు చివరి 3 1/2 సంవత్సరములలో జరుగు సంభావముల గురించి చదువగలము.

10వ అధ్యాయములో బలిష్ఠుడైన ఒక దూత గురించి చదువుచున్నాము. అతని చేతిలో విప్పబడిన యొక చిన్న పుస్తకమున్నది (10:2) ఈ దూత గురించి 10:1-3 వచనములు చదువునపుడు ఈ దూత యేసు క్రీస్తు అని గ్రహించగలము. యేసుక్రీస్తు ఈ గ్రంథమును తండ్రియైన దేవుని యొద్దనుండి పొందెను (5:1-7). మరియు ఈ గ్రంథము యొక్క ఏడు ముద్రలను దేవుని గొఱ్ఱెపిల్ల అయిన యేసుక్రీస్తు విప్పుట 6:1 నుండి 8:1 వచనములలో చదువగలము. ఇపుడు ఈ గ్రంథము అనగా చిన్న పుస్తకము యేసుక్రీస్తు తన చేతిలో కలిగియున్నాడు (10:2)

6వ ముద్రను విప్పుట 6:12 లో చదువుచున్నాము మరియు 7వ ముద్ర విప్పుట 8:1లో చదువుచున్నాము. మధ్యంతరమున 7వ అధ్యాయము వ్రాయబడినది. ఈ 7వ అధ్యాయము ముద్రలకు చెందినది కాదు కాని ఆ కాలములో జరుగు కొన్ని సత్యములను మనము 7వ అధ్యాయములో చదువగలము.

ఇదే విధముగా బూరల గురించి చూచినపుడు ఆరవ బూర ఊదుట 9:13లో చదువుచున్నాము మరియు 7వ దూత బూర ఊదుట 11:15 లో చదువుచున్నాము. ఇట్లు ఆరవ బూర ఊదుటకును మరియు 7వ బూర ఊదుటకును మధ్యంతరమున ఏమి సంభవించునో వాటిని మనము 10:1 నుండి 11:14 వరకు చదువగలము. అనగా 10వ అధ్యాయము యందు ఆరవ బూర మరియు 7వ బూర ఊదుటక మధ్యంతరమున జరుగు సంఘటనలు వ్రాయబడినవి.

ఈ విప్పబడిన చిన్నగ్రంథమునందలి సత్యములను యేసుక్రీస్తు శిష్యుడైన యోహాను ప్రవచించునట్లుగా ఈ చిన్న గ్రంథమును యేసుక్రీస్తు తన శిష్యుని భుజింపనిచ్చెను 10:9-11.

మధ్యంతరముగా వ్రాయబడిన వాక్యములలో (10:1 నుండి 11:14), 10వ అధ్యాయము పై విధముగా ఉండగా 1:1-2 నందు క్రీస్తు విరోధి యెరూషలేమును తన స్వాధీనము చేసికొనును (దానియేలు 1:40-45, 2థెస్స 2:3-4) మరియు మధ్యంతరముగా వ్రాయబడిన 11:3-12 వచనములలో దేవుడు నిజమైన ఇద్దరు సాక్షులు అనగా ఇద్దరు ప్రవక్తలను లేపుతాడు. వీరు చివరి 3 1/2 సంవత్సరములు ప్రవచించువారు అనగా యేసుక్రీస్తు యొక్క నిజమైన సాక్షులుగా ఉంటారు. తరువాత వారు చంపబడుతారు (4:7) కాని దేవుడు వారిని తిరిగి జీవింపచేసెను (11:11-12) మధ్యంతరముగా చెప్పబడిన 11:13-14 వచనములలో ఇద్దరు సాక్షులు పునరుత్థానము పొందుకొని పరలోకమునకు ఆరోహణమగుచుండురు గొప్ప భూకంపము సంభవించుట చదువగలము. ఇట్లు 10:1 నుండి 11:14 వరకు మధ్యంతరముగా వ్రాయబడిన వాక్యములు మధ్యంతరముగా సరియైన చోట వ్రాయించాడు. కనుక ముద్రలు విప్పుట, బూరలు ఊదుట మరియు ఉగ్రత పాత్రలు కుమ్మరించబడుట అనుక్రమము కొనసాగుచుండగా మధ్యంతరముగా వ్రాయబడిన వాక్యములు అందలి ముద్రలు, బూరలు మరియు ఉగ్రత పాత్రలకు చెందినవి కాకున్నను అదే సమయములో సంభవించుచున్న ఇతర సంఘటనలు అని మనము గ్రహించాలి.

10:1 నందు బలిష్ఠుడైన దూత వేరొక దూత పరలోకమునుండి దిగివచ్చుట చూచితిని అని చదువుచున్నాము. దేవుని దూతలు అందరు బలమైనవారు. అయినను అందులో కొందరు ప్రత్యేకమైన అధికారము మరి కొందరికి ప్రత్యేకమైన శక్తి సామర్థ్యములు కలిగియున్నవి (18:1, 2థెస్స 1:7, యూదా 9) 10:1 నందు చెప్పబడిన దూత యేసుక్రీస్తు అయియున్నాడు.అతని చేతిలో 7 ముద్రలు విప్పబడియున్న చిన్న పుస్తకము కలు (10:2). యేసుక్రీస్తు సింహము గర్జించునట్లు గొప్ప శబ్దముతో ఆర్భటించెను. యేసుక్రీస్తు ఆర్భటించినపుడు 7 ఉరుములు వాటి వాటి శబ్దములు పలికెను (10:3) యేసుక్రీస్తు యూదా గోత్రపు సింహము అయియున్నాడు (5:5, యెషయా 31:4-5, యిర్మియా 25:29-36, హోషేయ 11:10-11, యోవేలు 3:16, ఆమోసు 3:8 వాక్యభాగములలో యెహోవా దినమున యేసుక్రీస్తు సింహము గర్జింతు రీతిగా ఉండును అని మనము గ్రహించగలము. 10:6 నందు బలిష్ఠుడైన ఊత ఒట్టుపెట్టుకొనుట మనము చదువుచున్నాము. సామాన్యమైన దూతలు బైబిలులో ఎచ్చటను ఒట్టుపెట్టుకొన్నట్లు లేదు, అదే సమయమున అనేక చోట్ల దేవుడు ఒట్టుపెట్టు కొనినట్లుగా లేక ప్రమాణము చేసినట్లు చదువగలము. కనుక 10:6 బలిష్ఠుడైన దూత ప్రమాణము చేయుట మనము చదువునపుడు ఇతడు సామాన్యమైన దూత కాడు ఇతడు యేసుక్రీస్తు అని గ్రహించాలి. 10:4 ప్రకారము 7 ఉరుములు పలికిన సంగతులు వ్రాయ కూడదని పరలోకమునుండి ఒక స్వరము యోహానునకు వినిపించెను. ఇట్లు ఏమి వ్రాయవలెనో ఏమి వ్రాయకూడదో యేసుక్రీస్తు యోహానునకు సూచించుట ప్రకటన గ్రంథములో అనేక చోట్ల చదువగలము (1:1, 1:19, 2:1, 2:8, 2:12, 2:18, 3:1, 3:7, 3:12, 3:14, 10:4, 14:3-4, 19:9, 21:5).

11:1 నందు ఇంగ్లీషు బైబిలులో ప్రకారము ఈ బలిష్ఠుడైన దూత కొలకఱ్ఱ యోహానునకు ఇచ్చాడు. 11:3 ప్రకారము నేను నా ఇద్దరు సాక్షులకు అధికారము ఇచ్చెదను. అని చెప్పుట చదువుచున్నాము. ఈ మాటను బట్టి కూడ ఈ బలిష్ఠమైన దూత సామాన్యమైన దూత కాదు ఇతడు యేసుక్రీస్తు అయియున్నట్లు మనము గ్రహించాలి.

10:4 ప్రకారము 7 ఉరుములు పలికిన సంగతులము దేవుడు మర్మముగా ఉంచియున్నాడు (ద్వితి.కా॥29:29) 10:7 ప్రకారము దేవుడు తన దాసులగు ప్రవక్తలకు తెలిపిన సువార్త ప్రకారము దేవుని మర్మము సమాప్తమగును అని చదువుచున్నాము. ఇది 7వ దూత బూర ఊదునపుడు సంభవించును (10:7)

10:6 ప్రకారము బలిష్ఠుడైన దూత ఒట్టుపెట్టుకొని ఇక ఆలస్యము ఉండదు గాని ఏడవ దూత పలుకు దినములలో అతడు బూర ఊదబోవుచుండగా దేవుడు తన దాసులగు ప్రవక్తలకు తెలిపిన సువార్త ప్రకారము దేవుని మర్మము సమాప్తమగునని చెప్పెను. 7వ దూత బూర ఊదుట 11:15 నందు చదువుచున్నాము. అప్పుడు ఘటసర్పము అనగా సాతానుడు తన దూతలతో కూడ 12:7-12 ప్రకారము భూమి మీద పడద్రోయబడినాడు. కనుక దేవుడు 10:6 ప్రకారము ఆలస్యము చేయక సాతానుని పడద్రోసియున్నాడు. ఇట్లు పడద్రోయబడునని ముందుగానే లేఖనములలో వ్రాయబడియున్నవి (ఆది 3:15, యెషయా 24:21, 25:7, 27:1) 8:13లో వ్రాయబడిన మూడో అయ్యో అను మాట సాతానుడు భూమిపై పడద్రోయబడుటను సూచించుచున్నది. లోక రాజ్యములు 11:15 ప్రకారము మన ప్రభువు రాజ్యము అగుటకు ఇట్లు సాతానుడు పడద్రోయబడుట అవసరము.

10:8-11 ప్రకారము యోహాను బలిష్ఠుడైన దూత చేతిలోనుండి తీసికొని తినినట్లు చదువుచున్నాము. ఈ చిన్న పుస్తకము తినిన తరువాత ముందు సంభవించు ఘోరమైన తీర్పులను మనము మిగతా ప్రకటన గ్రంథములో చదువగలము. యెహెజ్కేలు భక్తుడు కూ ఇదే విధముగా దేవుడు ఇచ్చిన గ్రంథమును భుజించి రానున్న తీర్పులను ప్రవచించెను (యెహెజ్కేలు 2:8అ 3:3) యిర్మీయా భక్తుడు కూడ దేవుడు ఇచ్చిన గ్రంథమును భుజించి రానున్న తీర్పులను ప్రవచించెను (యిర్మీయా 15:16, 20:7-9).

కనుక 5:2 ప్రకారము దేవుని చేతిలో ఉన్న గ్రంథము యొక్క ఏడు ముద్రలు విప్పుచుండగా తీర్పులు తీర్చబడుచున్నవి ముద్రలు విప్పబడిన తరువాత ఆ గ్రంథములో వ్రాయబడినవి యోహాను ప్రవచించునట్లుగా దేవుడు ఆ గ్రంథమును యోహానునకు భుజింపనిచ్చెను. ఈ గ్రంథమును భుజించిన తరువాత యోహాను ఇంకను ముందు జరుగనున్న తీర్పులను గురించి వ్రాసియున్నాడు. కనుక ఈ గ్రంథములోనున్న ప్రకటన 6 నుండి 19వ అధ్యాయము వరకు వ్రాయబడిన తీర్పు కలిగియున్నవి అని మనము గ్రహించగలము. 10:2 మరియు 10:8 ప్రకారము బలిషదటడైన దూత అనగా యేసుక్రీస్తు తన కుడి పాదము సముద్రము మీదను ఎడమ పాదము భూమి మీదను మోపియున్నాడు. కాని ఇక 3 1/2 సంవత్సరముల తరువాతనే భూమిని పరిపూర్ణముగా స్వాధీనము చేసుకొనును (19:11-21, దానియేలు 7:13-14, జెకర్యా 14).

10:10 నందు యోహాను ఆ చిన్న పుస్తకమును తినినపుడు అది నోటికి తేనె వలే మధురముగా ఉండెను అనియు తరువాత అది కడుపునకు చేదుగా

ఉండెను అని చదువుచున్నాము. దేవుని యొద్ద నుండి సత్యము బయలుపరచబడినపుడు అది సంతోషము కలిగిస్తుంది కాని అసత్యము ప్రవచించునపుడు దేవుడు ప్రజలపై తీర్పు తీర్చనైయున్నట్లు యోహాను గ్రహించాడు కనుక అది తన కడుపునకు చేదుగా ఉండెను. అనగా ఇశ్రాయేలీయులు 7వ బూర ఊదు సమయమునుండి యాకోబు ఆపద దినములు ప్రారంభమగును. అనగా చివరి 3 1/2 సంవత్సరముల మహాశ్రమలు అనుభవిస్తారు (ప్రకటన 12, మత్తయి 24:15-21, యిర్మీయా 30:4-7). యోహాను చిన్న పుస్తకమును భుజించిన తరువాత 10:11 నందు యేసు క్రీస్తు యోహానుతో ఆ చిన్నగ్రంథములో తీర్పులను ప్రవచించుమన్నాడు. ఇదే విధముగా దేవుడు ఒక గ్రంథమును యెహెజ్కేలు భక్తునకుడ భుజింపనిచ్చెను. తరువాత యెహెజ్కేలు ప్రవచించినట్లుగా యెహెజ్కేలు గ్రంథములో చూడగలము. (యెహెజ్కేలు 2:8 నుండి 3:3)

యోహాను కూడ చిన్న పుస్తకమును భుజించిన తరువాత ప్రజలను గూర్చియు జనములను గూర్చియు ఆయా భాషలు మాటలాడు వారి గురించియు అనేక మంది రాజులను గురించియు ప్రవచించెను (10:11) అనగా 7వ బూర ఊదుట ప్రారంభము నుండి యేసుక్రీస్తు రెండవ రాకడ వరకు సంభవించువాటిని 11:15 నుండి 19:21 వరకు ప్రవచించెను.

(20వ భాగం తదుపరి 'క్రైస్తవనాడు'లో)

# 20. వారి కన్నులయెదుట నిన్ను గొప్ప చేయ మొదలు పెట్టెదను

**-యెహోషువ 3:7**



డా.జాయ్ చెరియన్
యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్
రాం నగర్, (హైద్రాబాద్)

దేవుడు ఈ వాగ్దానమును యెహోషువకు ఇచ్చాడు. “నేను మోషేకు తోడైయుండినట్లు నీకును తోడైయుందునని ఇశ్రాయేలీయులందరు ఎరుగునట్లు నేడు వారి కన్నులయెదుట నిన్ను గొప్పచేయ మొదలు పెట్టెదను.”– యెహోషువ3:7. మన చుట్టూ వుండేవారికి మనము గొప్ప కావడము అసలు ఇష్టము ఉండదు. నీవు నాశనము కావడమునే నీ శత్రువులు ఇష్టపడతారు. నీకు తీరని రోగము రావడము, నీ కుటుంబము విడిపోవడము, నీవు ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకోవడము, నీవు ఏడ్వడమే వారికి ఇష్టం. కాని దేవుడు వారి కన్నులయెదుట నిన్ను గొప్పచేయ మొదలు పెడతాడు. వారు చూస్తూ ఉండగా నీవు అత్యధికంగా ఎదిగిపోతావు. గొప్పతనం మనుష్యులవలన కలగదు దేవుని యొద్ద నుండేరావాలి. కొందరు గొప్పతనముకొరకు ప్రాకులాడి అలసిపోయి కూలిపోతారు. కాని గొప్పతనము రాదు. కొందరు పదవులు కావాలని నలుగురు నన్ను గుర్తించాలని నలుగురిలో నా పేరు మారుమ్రోగాలని తపిస్తుంటారు. అవన్నీ వ్యర్థమైన తలంపులు. నీ ప్రయత్నాలవలన గొప్పతనం ఎన్నటికీ రాదు. గొప్పతనము సర్వశక్తుడైన దేవుని యొద్ద నుండియే వస్తుంది. దేవుడే ఒకర్ని తగ్గిస్తాడు. దేవుడే ఒకర్ని హెచ్చిస్తాడు.

“రాజైన దావీదుకూడను బహుగా సంతోషపడి, సమాజము పూర్ణముగా ఉండగా యెహోవాకు ఇట్లు స్తోత్రములు చెల్లించెను– మాకు తండ్రిగానున్న ఇశ్రాయేలీయుల దేవా యెహోవా, నిరంతరము నీవు స్తోత్రార్హుడవు. యెహోవా, యెహోవా భూమ్యాకాశముల యందుండు సమస్తమును నీవశముబీ మహత్యమును పరాక్రమమును ప్రభావమును తేజస్సును ఘనతయు నీకే చెందుచున్నవిబీ యెహోవా, రాజ్యము నీది, నీవు అందరి మీదను నిన్ను అధిపతిగా హెచ్చించుకొని యున్నావు. ఐశ్వర్యమును గొప్పతనము నీవలన కలుగును, నీవు సమస్తమును ఏలువాడవు, బలమును పరాక్రమమును నీ దానములు, హెచ్చించువాడవును అందరికి బలము ఇచ్చువాడవును నీవే.” – 1 దిన. 29:10–12

గొప్పతనము, ఐశ్వర్యము ఆయనవలన కలుగుతాయి. నీవు ఏదో నెలనెల చిట్టివేసినందున నీకు గొప్పతనం రాదు. పైగా మోసపోతావు. నీవు నెల నెల చిట్టి వేసి, వేసిన వారి చుట్టూ తిరుగుతావు. వాడేమో డబ్బంతా పొగుచేసుకొని అడ్రసు లేకుండా ఇంటికి తాళం వేసికొని వెళ్ళిపోతాడు. అలాగాక నీవు దశమభాగము దేవునికి ఇచ్చి దేవుని ఘనపరచాలి. అప్పుడు ఆయన నిన్ను పట్టజాలనంతగా ఆశీర్వదిస్తాడో లేదో శోధించిచూడు. దేవుడు నీ పంటను తినివేయు పురుగులను గద్దిస్తాడు.

“యెహోవా ఆశీర్వాదము ఐశ్వర్యమిచ్చును నరుల కష్టముచేత ఆ యాశీర్వాదము ఎక్కువకాదు.”

నీవు దేవుని మాట వినుటవలన, దైవకార్యములు చేయుటవలన గొప్పతనము కలుగుతుంది. నీవు దేవుని కొరకు గొప్ప కార్యాలు తలపెట్టి విశ్వాసంతో ముందుకు సాగితే నీ వెంట గొప్పతనం ఉంటుంది. కానీ నీవు గొప్పతనాన్ని ముందు పెట్టుకొని నడిస్తే నీకు గొప్పతనము దొరకదు గొప్ప దేవుడుకూడా నీ అందుబాటులో ఉండదు. ఆయన ఆజ్ఞలను లోబడడమే గొప్పతనము. యెహోషువ మోషేకు పరిచారకుడుగా వున్నాడు. ఆయనలో ఏ గొప్పతనము లేదు కానీ దేవుడు అతన్ని గొప్పచేసాడు. మోషే ప్రజలతో మాట్లాడినప్పుడు యెహోషువ అతనికి పరిచర్య చేస్తూ అనేక విషయాల్లో అతనికి సహాయపడి యుంటాడు. కానీ దేవుడు యెహోషువ చేయి వదలలేదు. నీవు చేసే చిన్న పనికుడా దృష్టించే దేవుడు వున్నాడు. జాగ్రత్త! నీవు నీతిన్యాయాలతో చేసే ప్రతిపనిలో ఆయన ఉంటాడు. దేవుడు యెహోషువను చూసాడు. ఆయన పవిత్రంగా వుంటూ దైవజనునికి సత్కార్యాలు, పరిచర్య చేస్తున్నాడు. గొప్పతనమేమి కోరడము లేదు. ఘనతా ప్రభావములు ఆయనవలన కలుగుతాయి. యెహోషువను దేవుడు చాలా గొప్పగా దీవించాడు. వారి కన్నులయెదుట నిన్ను గొప్పచేయ మొదలు పెడతాను అన్నాడు. దేవుడు మొదలు పెడితే ఇక ఆ కార్యము ఆగుతుందా? ఆగదు. యెహోషువ జీవితంలో కూడా దైవకార్యము ఆగలేదు. ఆ కార్యము ఆరంభమై అక్షరాలా చుక్కలనంటుకుంది. యెహోషువ సూర్యచంద్రాదులను నిలిపివేశాడు. సూర్యుడా నిలువుమనగా సూర్యుడు నిలిచిపోయాడు. మోషే సూర్యుని ఆపలేదు కనాను రాజ్యంలో చేరలేదు. పిస్గా కొండపైనుండి దూరమున ఉన్న కనాను రాజ్యాన్ని చూసాడు. కానీ యెహోషువ కనాను రాజ్యంలో ప్రవేశించాడు. గొప్ప చేసేవాడు దేవుడే గనుక నీవు పరిశుద్ధంగా ఉండి దేవుని సేవించు. ఒక రోజున నీ నీతి మిట్టమధ్యాహ్నమువలె ప్రకాశిస్తుంది. పెంటకుప్పల మీద నుండి తన ప్రజలను ప్రధానులతో కూర్చోబెట్టే శక్తి ఆయనకే వుంది. నీకు నీ పిల్లలు, నీ కుటుంబము గొప్పకావాలానే ఆశ ఉంటే దేవుని మాట మీరకు. ఆయన బలిష్టమైన చేతుల క్రింద దీనమనస్కుడవై వుండు. తగిన సమయమందు ఆయన నిన్ను హెచ్చరిస్తాడు. మాటకు మాట, క్రియకు ప్రతిక్రియ చేయకు. సాత్వికుడవై వుండు. దేవుడు నిన్ను పైకెత్తుతాడు. నీ శత్రువుల ముందు ఆయన నీకు భోజన బల్ల సిద్ధపరుస్తాడు. వారి కన్నులయెదుట నిన్ను గొప్పచేస్తాడు.

నా సాక్ష్యము చూస్తే, తృణీకరింపబడిన రాయినైన నన్ను దేవుడు మూలకు తలరాయిగా చేసాడు. చాలా మంది ఈమె ఏంటి దేవుడు లేదని అంటుందని నన్ను తక్కువగా అంచనా వేశారు. కానీ దేవుడు నన్ను పిలిచినప్పుడు నేను ఆయన ఆజ్ఞలు మీరకుండా ఆయన రెక్కల క్రింద దీనమనస్కురాలై వున్నప్పుడు దేవుడు నన్ను గొప్ప చేయడం మొదలు పెట్టాడు. ఇప్పుడు ఆ కార్యము పట్టణములు, జిల్లాలు, రాష్ట్రాలు దేశాలు దాటిపోతుంది. సంఘములో “దేవుని వెయ్యి నామములు” బోధించుటకు, పుస్తకముగా ప్రచురించుటకు దేవుడే ఆ గొప్ప భాగ్యాన్ని నాకు అనుగ్రహించాడు. నా సేవను అంచెలంచెలుగా దీవించాడు. గొప్పతనము, ఐశ్వర్యము ఆయనవలననే కలుగుతాయి.

# 21. యెహోవా మీ మధ్య అద్భుత కార్యములను చేయును

**- యెహోషువ 3:5**

దేవుడు చేసిన గొప్ప అద్భుతమేమిటంటే ఆయన దినదినము నీకు ఊపిరిపోస్తూ..... నీ ప్రాణాన్ని నిలిపి నిన్ను సజీవుల లెక్కలో ఉంచి ఆత్మతో నింపుతూ.... ఆయన మాటలను నిత్యము నీకు వినిపించడమే. దేవుడు మీ మధ్య అద్భుతము చేస్తాడు. అద్భుతకార్యములు జరగడము అందరికి ఇష్టము. నా భర్త రోగము నయము కావాలి నా పిల్లలు క్లాసులో ఫస్ట్ రావాలి మా కుటుంబంలో దుఃఖము తీరిపోవాలి విడిపోయిన కుటుంబము తిరిగి కట్టబడాలి వూడిపోయిన నా ఉద్యోగము తిరిగి రావాలి డాక్టర్లు నయం చేయని రోగము క్షణంలో మాయమైపోవాలి. ఇలాంటి అద్భుతాలకొరకు అందరూ ఎదురు చూస్తారు. దేవుడు ఆశ్చర్యకరుడు.

“యెహోవా, వేల్పులలో నీవంటి వాడెవడు పరిశుద్ధతను బట్టి నీవు మహానీయుడవు స్తుతికీర్తనలనుబట్టి పూజ్యుడవు అద్భుతములు చేయువడవు.” నిర్గమకాండము 15:11

ఆయన నామము అద్భుతములు చేయువాడు. మీకు అద్భుత కార్యము జరగాలంటే ఒక షరతు ఉంది. “యెహోషువ – రేపు యెహోవా మీ మధ్య అద్భుతకార్యములను చేయును గనుక మిమ్మును మీరు పరిశుద్ధపరచుకొనుడని జనులకు ఆజ్ఞ ఇచ్చెను.” – యెహోషువ 3:5

అద్భుతకార్యములు కావాలంటే నీకు పరిశుద్ధత అవసరము. రేపు నీకు అద్భుతకార్యము కావాలంటే ఈ రోజు నీవు దేవుని సన్నిధిలో పరిశుద్ధపరుచుకోవాలి. పక్షవాతముతో పడకబట్టిన ఒకనిని కొందరు ప్రభువు ఉన్న ఇంటి పైకప్పు విప్పి మంచముతో సహా ప్రభువు మధ్యన దింపుతారు. పక్షవాతము గలవారికి కాళ్ళు, చేతులు బాగవ్వాలి. ముందుగా ఏసుప్రభువు ఆ మంచములో పడియున్నవాన్ని లేచి నడవమని అనలేదు. నీ పాపములు క్షమింపబడియున్నవి అన్నాడు. కాళ్ళు చేతులు కావలసిన వానికి పాపానికిగల సంబంధమేమి? అవును పాపానికి రోగానికి సంబంధముంది. కావున నీలో పాపముంటే దేవుని సన్నిధిలో వుండి పరిశుద్ధత పొందాలి. అవినీతిపరులంతా నీతిమంతులుగా మారిపోవాలి. నీలో పరిశుద్ధత ఉంటే దేవుడు నీకు అద్భుతములు చేస్తాడు.

రేపు యెహోవా అద్భుతకార్యములను చేయును గనుక మిమ్మును మీరు పరిశుద్ధపరచుకొనుడని యెహోషువ జనులకు ఆజ్ఞ ఇచ్చాడు. అక్కడ జరుగబోయే అద్భుతమేమిటంటే ఇశ్రాయేలీయులు యొర్దాను నది దాటాలి. వారికి యొర్దాను ఎదురైంది. వారు ఐగుప్తు నుండి బోట్లు ఏమీ తెచ్చుకోలేదు. మరి వారు ఆ యొర్దాను ఎలా దాటాలి? వారందరు తమ్మును తాము పరిశుద్ధపరచుకొని దేవుడైన యెహోవాకు మొక్కిపెట్టారు. అప్పుడు జరిగిన అద్భుతమే యొర్దాను నీళ్లు ఇరుప్రక్కల రాశిగా నిలిచిపోవడము.

“జీవముగల దేవుడు మీమధ్య నున్నాడనియు, ఆయన నిశ్చయముగా మీ యెదుటనుండి కనానీయులను హిత్తీయులను హివ్వీయులను పెరిజ్జీయులను గెరిగేసీయులను ఆమోరీయులను యెబూసీయులను వెళ్ళగొట్టుననియు దీనివలన మీరు తెలిసికొందురు. కాబట్టి ప్రతిగోత్రమునకు ఒక్కొక్క మనుష్యుని ఇశ్రాయేలీయుల గోత్రములలోనుండి పన్నిద్దరు మనుష్యులను ఏర్పరచుకొనుడి.సర్వలోక నాథుడగు యెహోవా నిబంధన మందసమును మోయు యాజకుల అరకాళ్ళు యొర్దాను నీళ్లను ముట్టగానే యొర్దాను నీళ్ళు, అనగా ఎగువనుండి పారునీళ్లు ఆపబడి యేకరాశిగా నిలుచును. కోత కాలమంతయు యొర్దాను దాని గట్లన్నిటిమీద పొర్లిపారునుబీ నిబంధన మందసమును మోయు యాజకులు జనులకు ముందు వెళ్లగా యొర్దానును దాటుటకై జనులు తమ గుడారములలోనుండి బయలుదేరిరి. అప్పుడు ఆ మందసమును మోయువారు యొర్దానులో దిగిన తరువాత మందసమును మోయు యాజకుల కాళ్ళు నీటి అంచున మునగగానే పైనుండి పారు నీళ్లు బహు దూరమున సారెతానునొద్దనున్న ఆదామను పురమునకు దగ్గర ఏకరాశిగా నిలిచెను. లవణసముద్రమను ఆరాబా సముద్రమునకు పారునవి బొత్తిగా ఆపబడెను. జనులు యెరికోయెదుటను దాటగా యెహోవా నిబంధన మందసమును మోయు యాజకులు యొర్దానుమధ్య ఆరిన నేలను స్థిరముగా నిలిచిరి. జనులందరు యొర్దానును దాటుట తుదముట్టువరకు ఇశ్రాయేలీయులందరు ఆరిన నేలమీద దాటుచు వచ్చిరి”. యెహోషువ 3:11–17.

నిబంధన మందసము మోషే యాజకులు పవిత్రమైన, పరిశుద్ధమైన ప్రవర్తన కలిగి ప్రజలకు ముందు నడవాలి. ప్రజలు వారి వెనుక నడవాలి. కావున యాజకులకు పవిత్రత చాలా అవసరము. నేటి కాలానికి పోల్చితే మందసమనగా దేవుని సేవ. మందసము మోసే యాజకుల అరికాళ్లు యోర్దానును తాకగానే యోర్దాను పాయలుగా విడిపోయింది. ఆరిన నేలను ఇశ్రాయేలీయులు నడిచిపోయారు. అందుకే చాలామంది ‘సిస్టర్, మా ఇంటికి రండి’ అని నన్ను పిలుస్తుంటారు. యథార్థముగా దేవుని సేవ చేసే ఏ భక్తులైనా మీ ఇంట్లో పాదాలు పెడితే అక్కడ దేవుడు అద్భుత కార్యాలు చేస్తాడు. రేపు నీకు దేవుని అద్భుతము జరగాలంటే ఈ రోజు నీ పాపాన్ని తొలగించుకోవాలి. నీ గుండెలో ఉన్న పాపము వదిలిపెట్టకుండా అద్భుతము జరగాలంటే జరగదు. అలాగాక నిన్ను నీవు పరిశుద్ధపరచుకొన్నప్పుడు నీ గృహములో, సంఘములో, సమాజములో అద్భుతములు జరుగుతూనే ఉంటాయి.

*Grant thee according to thine own heart, and fulfill all thy counsel. Ps. 20:4*

# NGO CONSULTENCY

Under the Amen Society Patron (NGO)

-: OUR SERVICES / DOCUMENTATIONS :-

1. Society, Association, Federation, Foundation, Trust.
2. PAN, 12A, 80G & FCRA Applications.
3. Web Creations & Renewals.
4. Society Renewals & Amendment Procedures.
5. Accounts & Audit, IT Returns File Undertaken.
6. Church & Pastors necessities.
7. Minutes Register Work, Annual Reporting.
8. General Documents.

Contact: Rev. P. Prabhudas B.A. B.D
Email: prabhudasp2@yahoo.com
PRAISE THE LORD
Cell: 9494026841

Living Word
Theological College

"Living Word Theological College seeks to train and develop passionate servants of Jesus Christ to accomplish the Great Commission"

- Bishop Dhanraj Kota,
Chairman, LWT College.



LIVING WORD
Theological College

Netajinagar, Sainikpuri, Kapra, Hyderabad

Offers
Bachelor of Theology
2 Years Residential Course

Qualifications
Born Again & Inter Pass

Contact for
Application & Prospectus

# 101, YMCA Complex,
Sarojini Devi Road,
Secunderabad - 500 003
Ph : 040 27804433
njmoffice@gmail.com

Director : Rev.Dr.Dhanraj Kota
9849272313

PARTNERING WITH YOU
IN PURSUING YOUR CALL

## ...పరీక్షించుకో! ధనం కోసమా లేక దైవం కోసమా?!

<u>ధనంకోసం :</u>
ఆయాచితంగా సహకరించమనుట లేక మరే విధంగానైనా ధన సంపాధనకై ప్రయాసపడుట ఈ కోవకు చెందేవి.

<u>దైవం కోసం :</u> వాక్యాన్ని మరింత ఎరుగుట. వాక్యంలో బలపడేందుకు ప్రశ్నలు, సందేహాలు నివృత్తి చేసుకొనుట. సువార్త చెప్పేందుకు ఆయత్తపడుట ఈ కోవకు చెందేవి.

(పై రెండు అంశాలకు చెందేవి ఇంకా ఉన్నాయి. టూకీగా ఇచ్చాం)

**ఇప్పుడాలోచించండి! సరిచూచుకోండి!!**
**సరిచేసుకోండి!!!**

మీరు దేనికోసం ఇతరులతో, సహోదరులతో టచ్‌లో

**ఇతరులను, క్రైస్తవులను మీ ఫోన్ ద్వారా పలుకరించేది లేక దర్శించేది ధనం కోసమా లేక దైవం కోసమా?!**

ఉంటున్నారో! సంప్రదిస్తున్నారో!

ఇచ్చిపుచ్చుకొనుట తప్పుకాదు. ముందు ఇవ్వండి. ఆ తర్వాత అడగండి.. పొందండి.





They shall become one flesh
Christian Marriage Bureau
a part of
SAM KUMAR INTERNATIONAL MINISTRIES

CHRISTIAN MARRIAGE BUREAU
SAM KUMAR INTERNATIONAL MINISTRIES

క్రైస్తవ వివాహ
సంబంధాల పరిచయం

మీ ముద్దుల కుమార్తెను అపురూపముగా చూసే వరునికొరకు వెతుకుతున్నారా?
మీ ఇంటి పేరు నిలిపే మీ కుమారునికి అనువైన వధువు కోసం వెతుకుతున్నారా?

అయితే మమ్ములను సంప్రదించండి.

దేవుని పరిచర్యలో భాగముగా వందలాది వివాహము చేసి అనేక కుటుంబాలను కట్టి అనేకమందికి ఆశీర్వాదకారణముగా నిలిచి అలుపెరుగని దైవ పరిచర్య చేయుచున్న బిషప్ శామ్‌కుమార్ గారి పరిచర్యలో దిగ్విజయముగా నడుచుచున్న ఈ మ్యారేజి బ్యూరోను సంప్రదించండి.

మీ కుటుంబానికి అన్ని విధములా సరిపడ్డ వధువు/వరుల కోసం ప్రార్థిస్తాము. ప్రయత్నిస్తాము.

మా ప్రత్యేకతలు :
- మీ పిల్లల విషయములు, మీ విషయములు గోప్యముగా ఉంచబడును.
- ప్రార్థనా పూర్వకంగా తక్కువ కాలవ్యవధిలో మంచి సంబంధాలను పరిచయం చేయబడును.
- మీ పిల్లల జీవితము కొరకు దైవజనులు మరియు ప్రార్థనా గోపురం వారు ప్రార్థించెదరు.
- విదేశాలలో ఉన్న వారికి కూడా మంచి సంబంధములు పరిచయం చేయుట మా ప్రత్యేకత

పెళ్ళికి సిద్ధమైన మీ కుమారుని/కుమార్తె వివరములు మరియు 3 ఫోటోలను వెంటనే మా మ్యారేజ్‌బ్యూరో నెంబర్ 95 81 41 31 15 కు Whatsapp చేయండి.



SAMKUMAR INTERNATIONAL MINISTRIES

www.samkumar.org.in

## 'క్రైస్తవనాడు' ప్రత్యేకతల్లో కొన్ని... అన్నీ బైబిలుకు అనుకూలమే!

<u>**జీవిత చందాలు అడుగుటలేదు :**</u>

'క్రైస్తవనాడు' ఏనాడూ జీవిత చందాలిమ్మని ప్రచురించలేదు. ఇది 'క్రైస్తవనాడు'కే చెల్లింది. అలా అడుగుట పరిశుద్ధ గ్రంథంకు వ్యతిరేకం కాబట్టి. ఎంత దొరికితే అంత చొప్పున విశ్వాసులనుంచి దండుకోడానికే 'జీవితచందా' ఉపయోగపడుట కడుశోచనీయం. రేపటి గురించి చింతించోద్దని పరిశుద్ధ గ్రంథమంటే ఏకంగా 'జీవితం' మొత్తానికి ఎలా అడగ్గలం?! జీవితమంటే ఎవరిది? చందాకట్టే పాఠకులదా? లేక పత్రికదా? ఆలోచించాలి. జీవితచందా పాఠకులు కట్టేరనుకోండి! ఆ పాఠకులు బ్రతికున్నంత కాలం పత్రిక పంపాలా? ఎన్ని సంవత్సరాలు? ఆ పాఠకులు చనిపోయిన తర్వాత సంగతో? ఆ పాఠకుల ఇంట్లో వారెవరైనా మళ్లీ చందాకట్టాలా? లేక అలా పంపుతూనే ఉంటారా?

పాఠకులు చందా కట్టిన తర్వాత ఆ పత్రికో లేక పేపరో ఎంతకాలం నడుస్తుంది? ఇంతకాలం మీకు పత్రిక పంపగలం అన్న గ్యారంటీ ఆయా పత్రికల వాళ్లు ఇవ్వగలరా? లేక ఇస్తున్నారా?

'జీవితచందాలన్నవి' కేవలం దొరికిన కాడికి దొరికినంత దండుకోడానికే నన్నది 'సత్య'దూరం కాదు. ఇది పరిశుద్ధ గ్రంథంలో పట్టున్న వారు చెప్పిందే!! పాఠకులందరూ ఇట్టి విషయాలు గమనించాలి. మరి 'క్రైస్తవనాడు' సంగతో? అన్న సందేహానికి ముందే జవాబిచ్చాం. 'జీవితచందా' అడగమని. సంవత్సరచందా మాత్రమే అడుగుతాం. ఇప్పటికే గతపన్నెండేండ్ల నుంచి ఎందరో 'క్రైస్తవనాడు' చదివే పాఠకులున్నారు. కాబట్టి 'సంవత్సర చందా' మాత్రమే అడుగుతాం. 'క్రైస్తవ నాడు' తొలిపేజీ నుంచే 'సువార్త'తో మొదలై తదుపరి పేజీల్లో పరిశుద్ధ గ్రంథంలోగల అనేక సంగతులను ఆశ్చర్య కర రీతిలో వివరిస్తుంది. 'సువార్త' కు, 'సువార్త సహకారినికి' ఒక సంవత్సరం ముందు నుంచే సిద్ధపడాలని పరిశుద్ధ గ్రంథమే ఘంటాపథంగా చెబుతుంది. అందుకే మేం కేవలం సంవత్సరచందా మాత్రమే అడుగుతాం. వాక్యానికి లోబడే పరిచర్య చేస్తాం. అందుకు 'దేవునికి స్తోత్రం'.

<u>**మీ చందా పంపండని ఏనాడూ అడుగుట లేదు:**</u>

పాఠకులకు ఫోన్ చేసో లేక ఉత్తరమేసో మీ చందా పంపండని 'క్రైస్తవనాడు' ఏనాడూ అడుగలేదు. అందుక్కారణం... క్రైస్తవులను అడగనవసరం లేదు. ఎందుకంటే వారు అడక్కమునుపే ఇచ్చే దేవుని కలిగున్నవారు. అదే మాదిరి చూపుతారు. వారే యేసుకు తమ్ముళ్లు, చెల్లెళ్లు తద్వారా దేవుని పిల్లలు. దేవుని పిల్లలను ఆయన పని చేయుటకు ప్రత్యేకించి అడగక్కర్లేదు. ఆయాచితంగా వచ్చే వాటికై వెంపర్లాడరు. ఉచితంగా ఏదీ తీసుకోరు. తాము పొందిన దానికి తగ్గట్లు ఇస్తారేగాని ఎవరికీ ఋణస్థులు కారు.. కాలేరు! దేవుని జ్ఞానాన్ని నీ ఆస్తి అంతా ఇచ్చి కొనుక్కోమంటుంది పరిశుద్ధ గ్రంథం. కాబట్టి 'క్రైస్తవులు' తాము ఆయా పేపర్ల ద్వారా ఎంతగా దేవుని జ్ఞానాన్ని నేర్చుకుంటుంటారో అంతాగా వెల చెల్లిస్తూనే ఉంటారు. అందుకు భిన్నంగా ఉన్న వారు క్రైస్తవులే కారంటుంది పరిశుద్ధ గ్రంథం. పిసినార్లు (లోభులు) 'క్రైస్తవులే' కారు... కాలేరు అని నిర్ద్వందంగా చెబుతుంది పరిశుద్ధ గ్రంథం.

తదుపరి 'క్రైస్తవనాడు' పేపర్లో మరికొన్ని 'సత్యాలు' చదివి ఆచరణలో చూపండి. అప్పుడు దైవాశీర్వాదాలన్నవి వాటంతటవే మీ చెంతకొస్తాయి.

**– బ్రదర్ వైకెయార్**



Printed ,Published , Edited and Owned by Y.Kanaka Raju, 13 - 237, Ambedkar Nagar, Old Police Station Center, Nr.TIC Point, Arilova, Visakhapatnam - 530 040, Andhra Pradesh State, INDIA. Ph : 9346960601,9866113513. E-mail: y_kanakaraju1@yahoo.co.in., Printed at JC Printers, Ambedkar Nagar, Arilova, Visakhapatnam - 40.